# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 202 | హైదరాబాద్ | ఆదివారం 01-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...
అమెరికా రిటైర్డ్ అధికారి కీలక వ్యాఖ్యలు



## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం
- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్

11లో

## అమెరికాలో మళ్లీ షట్‌డౌన్.. పాక్షికంగా స్తంభించిన ప్రభుత్వ కార్యకలాపాలు

- ఫెడరల్ బడ్జెట్‌కు ఆమోదం లభించకపోవడమే కారణం
- నిరసనకారుల మృతితో నిధులపై చర్చలకు ఆటంకం
- షట్‌డౌన్ స్వల్పకాలమేనని అంచనా వేస్తున్న నేతలు
- సెనేట్ ఆమోదించిన ప్యాకేజీపైనే అందరి దృష్టి

11లో





- రేపు కేంద్ర బడ్జెట్ 2026 27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం
- వృద్ధికి ఊతమిస్తూనే ఆర్థిక క్రమశిక్షణ పాటించడంపై ప్రభుత్వం దృష్టి

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం.. రేపే కేంద్ర బడ్జెట్

11లో

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా

## మన అభ్యర్థులు ఉండాలి

- అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
- అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన



11లో



11లో

ఉప ముఖ్యమంత్రిగా

## సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం

- ముంబైలోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్
- ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ప్రమాణం
- సునేత్రాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



రేపు కేసీఆర్ సిట్ విచారణ..

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు




11లో

- శాంతియుతంగా నిరసన చేపట్టాలన్న కేటీఆర్
- మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొనాలని పిలుపు
- పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని సూచన

ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

## గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

- ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- 24 గంటల్లో 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు
- కుప్పంలో 3 కిలోమీటర్లు ఇ-సైకిల్ నడిపిన సీఎం చంద్రబాబు
- రూ.35 వేల సైకిల్‌ను రూ.25 వేలకే పొందే అవకాశం
- ఇ-మోటరాడ్ సంస్థతో ఒప్పందం.. కుప్పంలోనే అసెంబ్లింగ్



11లో

## ఏప్రిల్ 30 నాటికి అయోధ్య రామాలయం అన్ని పనులు పూర్తి

- ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1,900 కోట్లుగా అంచనా వేసినట్లు వెల్లడి
- రూ.1,600 కోట్లు ఇప్పటికే చెల్లించామన్న నిర్మాణ కమిటీ ఛైర్మన్
- ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు పూర్తవుతాయన్న ఛైర్మన్



11లో



అమరావతిలో అంతర్జాతీయ

## క్రికెట్ స్టేడియం పనుల జోరు

- కూటమి ప్రభుత్వం రాకతో అమరావతిలో పెరిగిన పనుల వేగం
- నవులూరు వద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం
- 34 వేల సీటింగ్ కెపాసిటీతో, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- పనుల పురోగతిపై మున్సిపల్ శాఖ వీడియో విడుదల

11లో

భారతశక్తి

# జాతికి సిగ్గుచేటు

'డాక్టర్లకు నేను బతుకుతానన్న నమ్మకం లేదు. నా తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. 37 సుదీర్ఘ సర్జరీల వల్ల విపరీతమైన నొప్పి, అంతులేని నిరాశ, ఒంటరితనం కమ్మేశాయి. తీరా ప్రాణాలతో బయటపడ్డా సమాజం ఎలా చూస్తుందో, అందులో ఎలా నెగ్గుకురావాలో అనే ఆందోళన వేధించేవి'– 11 ఏళ్ల వయసులో యాసిడ్ దాడికి గురై, అనంతర కాలంలో ఆత్మస్థైర్యంతో శాస్త్రీయ సంగీతంలో రాణించి, ఇటీవల 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైన మంగళా కపూర్ భయంకర అనుభవాలివి. రాక్షసత్వానికి పరాకాష్ఠ వంటి యాసిడ్ దాడుల వల్ల దేశీయంగా ఎంతోమంది జీవితాలు కల్లోలంలోకి జారిపోతున్నాయి. ఉన్మాదం తలకెక్కి పచ్చని బతుకులను బుగ్గిచేస్తున్న పిశాచ సంతతికి త్వరితగతిన కఠిన శిక్షలు కరవవుతున్నాయి. ఈ దారుణావస్థపై సుప్రీంకోర్టు తాజాగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. షహీన్ మాలిక్ అనే యాసిడ్ దాడి బాధితురాలికి 16 ఏళ్లుగా తగిన న్యాయం దక్కకపోవడాన్ని జాతికి సిగ్గుచేటుగా అభివర్ణించిన న్యాయపాలిక– జుగుప్సాకర నేరాలకు పాల్పడేవారికి గట్టి దండనలు పడేలా చట్టాలను కఠినతరం చేయాలని కేంద్రానికి సూచించింది. యాసిడ్ దాడుల కేసుల్లో దోషుల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదన్న 'సుప్రీం' ప్రశ్న సైతం సహేతుకమైనదే! ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2014–23 మధ్య దేశవ్యాప్తంగా రెండువేలకు పైగా యాసిడ్ దాడులు నమోదయ్యాయి. సమాజం చిన్నచూపు చూస్తుందనే ఆందోళన, కుటుంబ ఒత్తిళ్లు, ప్రతీకార చర్యల భయంతో చాలామంది నోరునొక్కేసుకుంటుండటంతో మరెన్నో కేసులు బయటపడటం లేదన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. పితృస్వామ్య భావజాలాన్ని తలకెక్కించుకున్న కొందరు ప్రబుద్ధులు తమను కాదన్నారన్న కారణంతో యువతులపై ఎక్కువగా ఇలాంటి హేయ దారుణాలకు పాల్పడుతున్నారు. నిండు జీవితాన్ని నరకప్రాయంగా మార్చే యాసిడ్ దాడులను నివారించేందుకు పుష్కర కాలం కిందటే చట్టాలను పదును తేల్చారు. కానీ, వ్యవస్థాగత లోపాల వల్ల కేసులు ఒక కొలిక్కి రావడంలేదు. అధికారిక లెక్కల ప్రకారం 2023 నాటికి అలాంటి 689 కేసుల్లో విచారణలు పెండింగ్‌లో పడి ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ్‌బెంగాల్, గుజరాత్ వంటి చోట్ల అవి ఎక్కువగా పోగుపడ్డాయి. అపరిష్కృత కేసుల గుట్టను వేగంగా కరిగించాలంటే సుప్రీంకోర్టు సూచించినట్లు, ప్రత్యేక కోర్టులను కొలువుతీర్చాలి. దాంతో పాటు నిస్సహాయ బాధితుల పట్ల సమాజం, అధికార యంత్రాంగం మానవీయతతో వ్యవహరించాలి!దేశంలో పదికీ పరక్కీ యాసిడ్ విచ్చలవిడిగా దొరుకుతుండటం క్రూర నేరగాళ్లకు కలిసివస్తోంది. న్యాయపాలిక ఆంక్షలు విధించినప్పటికీ చాలాచోట్ల యథేచ్ఛగా ప్రాణాంతక రసాయనాల విక్రయాలు సాగుతున్నాయి. అసలే పుట్టెడు దుఃఖంలో ఉండే యాసిడ్ దాడుల బాధితులకు నష్టపరిహారాలూ సకాలంలో అందడంలేదు. ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 21శాతం మందికే పరిహారం దక్కింది. చాలా మంది వైద్య ఖర్చులను సొంతంగా భరించాల్సి వస్తోంది. కౌన్సెలింగ్, పునరావాసమూ మాటలకే పరిమితమవుతున్నాయి. 'కేసును సెటిల్ చేసుకోవాలని దర్యాప్తు అధికారి నాపై ఒత్తిడి తెచ్చారు' అన్న షహీన్ మాటలు– నేరగాళ్లకు వంతపాడే కొందరు పోలీసుల పెడబుద్ధులను పట్టిస్తున్నాయి. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి. భావోద్వేగాలపై నియంత్రణ లేనివారు, వివక్షాపూరితమైన ఆలోచనలు కలిగినవారే యాసిడ్ దాడుల వంటి అకృత్యాలకు తెగబడుతుంటారు. చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పుతూ, నేరాల విపరిణామాలపై విద్యాలయాల్లో అవగాహన కల్పిస్తూ నవతరాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవడంపై అందరూ దృష్టిపెట్టాలి!

# వైఎస్ ఫ్యామిలీ లో పాలిటిక్స్

## అన్నా, చెల్లెళ్ల పాదయాత్ర



కడప, జనవరి 31 (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం త్వరలో ఒక అరుదైన మరియు అత్యంత ఆసక్తికరమైన ఘట్టానికి వేదిక కాబోతోంది. వైఎస్సార్ వారసత్వ పోటీలో ఉన్న అన్నాచెల్లెళ్లు జగన్ మోహన్ రెడ్డి , వైఎస్ షర్మిల పోటాపోటీగా పాదయాత్రలకు సిద్దమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచారం మాత్రమే కాదు, అది అధికార పీఠాన్ని అధిరోహించడానికి ఒక సెంటిమెంట్ , బలమైన అస్త్రం. గతంలో వైఎస్సార్, ఆ తర్వాత జగన్, షర్మిల , లోకేష్ అందరూ దీని ద్వారానే ప్రజలకు దగ్గరయ్యారు.మరోసారి అధికారం కోసం జగన్ తన పాదయాత్రను ఏడాదిన్నర ముందే ప్రకటించడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఉన్నట్లు కనిపిస్తోంది. షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టినప్పటి నుండి వైఎస్సార్ అభిమానులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. షర్మిల కూడా పాదయాత్రకు సన్నద్ధమవుతున్నారనే సమాచారంతోనే, జగన్ ముందస్తుగా తన యాత్రను ప్రకటించి హైప్ ను తన వైపుకు తిప్పుకోవాలని చూస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.సాధారణంగా ఏదైనా భారీ కార్యక్రమాన్ని ముందుగా ప్రకటిస్తే దానికి ఉండే క్రేజ్ తగ్గుతుంది. అయినప్పటికీ జగన్ ఈ సాహసం చేయడం వెనుక షర్మిల అడుగులను నియంత్రించే ఉద్దేశం ఉండవచ్చని చర్చ జరుగుతోంది. జగన్ యాత్రను ప్రకటించిన తర్వాత షర్మిల కూడా అదే బాట పడితే, ఆమె జగన్‌ను అనుసరిస్తున్నారనే ముద్ర పడే అవకాశం ఉంది. అయితే, షర్మిల ఈ విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. జగన్ ప్రకటించారనే నెపంతో ఆగిపోకుండా, తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ఆమె ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఒకే సమయంలో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ రోడ్లపైకి వస్తే ఏపీ రాజకీయం రెండు గ్రూపులుగా విడిపోయే అవకాశం ఉంది.జగన్ పాదయాత్ర ప్రధానంగా గత ఎన్నికల్లో కోల్పోయిన ప్రజాధారణను తిరిగి సంపాదించుకోవడానికి, అలాగే తన కేడర్‌లో ఉత్సాహం నింపడానికి ఉద్దేశించినది. కానీ షర్మిల వ్యూహం వేరుగా ఉంది. ఆమె జగన్ వైఫల్యాలను ఎండగట్టడమే కాకుండా, నిజమైన వైఎస్సార్ వారసురాలు నేనే అని నిరూపించుకోవాలని చూస్తున్నారు. తాజాగా ఆమె విజయవాడలో జగన్ నైజంపై చేసిన విమర్శలు దీనికి సంకేతం. జగన్ యాత్ర ప్రకటించడంపై ఆమె వేసిన సెటైర్లు చూస్తుంటే, పాదయాత్రలో ఆమె జగన్‌ను మరింత వ్యక్తిగతంగా, రాజకీయంగా ఇరకాటంలో పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జగన్ తన పాదయాత్ర ద్వారా తన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయాలని చూస్తుంటే, షర్మిల మాత్రం ఆ పథకాల అమలులో జరిగిన లోపాలను, జగన్ పాలనలోని లోపాలను ఎత్తిచూపే అవకాశాలు ఉన్నాయి. ఒకప్పుడు జగన్ కోసం షర్మిల పాదయాత్ర చేశారు. జగనన్న వదిలిన బాణాన్ని అని గర్వంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు అదే బాణం జగన్‌ను గురి పెడుతోంది. ఒకే రాష్ట్రంలో, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నేతలు, ఒకే లక్ష్యం కోసం వేర్వేరుగా పాదయాత్రలు చేయడం భారత రాజకీయ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం కాబోతోంది. వీరిద్దరి మధ్య పోరాటమే రాబోయే ఎన్నికల వరకు ఏపీ రాజకీయాల్లో హైలైట్ కానుంది. ప్రజలు ఎవరికి వారసత్వం కట్టబెడతారో వేచి చూడాలి.

# రాజ్యసభకు బొత్స- అసెంబ్లీకి కుమార్తె

విజయనగరం,జనవరి 31 (భారత శక్తి):



సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన రాజకీయ వారసత్వాన్ని రంగంలోకి దించుతున్నారు. బొత్స కుమారుడు ఆయన వారసుడిగా వస్తారని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆయన కుమార్తె తెరపైకి వచ్చారు. ఇప్పటికే ఆమె తండ్రి వెంట రాజకీయ సమావేశాలకు హాజరవుతున్నారు. బొత్స సత్యనారాయణ.. ఉమ్మడి ఏపీలో కానీ? ఇప్పుడు ప్రస్తుత రాష్ట్రంలో కానీ సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరు. ఐదుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయన, బొబ్బిలి ఎంపీగా.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాలను ప్రభావితం చేసిన బొత్స.. ప్రస్తుతం మండలిలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. విజయనగరం జిల్లాను శాసించిన ఆయన మొన్నటి ఎన్నికల్లో చేదు అనుభవం ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బొత్స కుటుంబం ప్రభావితం చేయగలుగుతంది. ఆయన భార్య ఝాన్సీ రెండు సార్లు ఎంపీగా గెలుపొందగా.. సోదరుడు అప్పలనర్సయ్య ఎమ్మెల్యేగా.. తన మేనల్లుడు చిన్న శ్రీను ముఖ్య రాజకీయ నేతగా ఉన్నారు.వైఎస్ మరణం తర్వాత జరిగిన పరిణామాల్లో ముఖ్యమంత్రిగా ఈయన పేరు కూడా పరిగణలోకి తీసుకున్నారు. వైఎస్ హయాం నుంచీ తిరుగులేని నేతగా ఉన్న ఆయన ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో కాస్త నెమ్మదించారు.

ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేకపోవడం.. మండలి వైపు వెళ్లిపోవడంతో రాజకీయాల్లో తన కుటుంబాన్ని మరింత యాక్టివ్ చేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన అనూహ్యంగా తన కుమార్తెను తీసుకొచ్చారు. బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్, కుమార్తె అనూష ఇద్దరూ వైద్యులే. కొంత కాలం తండ్రితో కలిసి రాజకీయాల్లో ఉన్నప్పటికీ సందీప్ అంత చుర్గ్గాగా పాల్గొనలేదు. వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న ఆయనకు రాజకీయాలపై అంత ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఎంబీబీఎస్ చదివిన అనూష ఈమధ్య తండ్రితో కలిసి రాజకీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇంట్లో జరుగుతున్న ముఖ్య నేతల మీటింగ్‌లకే కాదు.. నియోజకవర్గ కార్యకర్తల సమావేశాలకు కూడా అ?టెండ్ అవుతున్నారు. మంగళవారం గరివిడిలో జరిగిన వైసీపీ చీపురుపల్లి నియోజకవర్గ సమావేశానికి తండ్రితో కలసి వచ్చారు.బొత్స సత్యనారాయణను రాజ్యసభకు పంపే యోచనలో వైసీపీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడు నియోజకవర్గ బాధ్యతలను కుమార్తెకు అప్పగించాలనుకుంటున్నారు. అందుకు ఆమెను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ మధ్యలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను పోటీ చేయిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. చీపురుపల్లి పరిధిలోని ఓ మండలం నుంచి ఆమె జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా అంతటా టీడీపీ ఎమ్మెల్యేలే ఉండటంతో జెడ్పీ పీఠంపై వైసీపీకి ఆశలు లేవు కానీ.. అసెంబ్లీ ఎన్నికల సమయానికి జెడ్పీటీసీ పనిచేసిన అనుభవం పనికొస్తుందని భావిస్తున్నారు.

# ఏపీ భవిష్యత్తును చూపించిన ఆర్థిక సర్వే

గుంటూరు, జనవరి 31 (భారత శక్తి):

ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే లో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన అంశాలు ప్రజల్లో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నగరాల అభివృద్ధి, జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై చేసిన విశ్లేషణలో ఏపీ నుంచి రెండు నగరాలు టాప్ టెన్ జాబితాలో చోటు దక్కించుకోవడం గర్వకారణంగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో ఆర్థిక ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని సర్వే పేర్కొనడం శుభ సూచకంగా భావిస్తున్నారు.ఆర్థిక సర్వే ప్రకారం ఏపీలో తిరుపతి, విజయవాడ ) నగరాలు అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాయి. జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉండటం, ఉపాధి అవకాశాలు పెరగడం, మౌలిక వసతులు విస్తరించడం వంటి అంశాల ఆధారంగా దేశంలోని ఉత్తమ నగరాల జాబితాను రూపొందించగా, అందులో ఈ రెండు నగరాలు చోటు దక్కించుకోవడం విశేషం. ప్రజలు కలిసి నివసించేందుకు అనుకూలంగా ఉండే నగరాలుగా గుర్తింపు రావడం ఏపీ అభివృద్ధికి నిదర్శనంగా భావిస్తున్నారు.ఇక నగరాల వృద్ధి వేగాన్ని పరిశీలిస్తే, హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా విజయవాడను ఆర్థిక సర్వే గుర్తించింది. ఇది రాష్ట్రానికి మరింత పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తు అంచనాల ప్రకారం 2031 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉండగా, అదే సమయంలో విజయవాడ జీడీపీ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి చేరవచ్చని సర్వే అంచనా వేసింది. ఈ గణాంకాలు తెలుగు ప్రాంతాల ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు.రాష్ట్ర రాజధాని అమరావతి గురించి కూడా ఆర్థిక సర్వేలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త నగరాల నిర్మాణం జరుగుతోందని సర్వే వెల్లడించింది. అమరావతిని హరిత నగరంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికలు అమలు అవుతున్నాయని, దీనివల్ల పర్యావరణ అనుకూల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంది. రాజధానిగా అమరావతికి ఉన్న అవకాశాలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా మారనున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాణిజ్యం, పరిశ్రమల రంగంలో కూడా ఏపీ ముందంజలో ఉందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. రాష్ట్రంలో చేపట్టిన వాణిజ్య సంస్కరణలు వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచాయని పేర్కొంది. సింగిల్ విండో విధానం (అమలుతో పరిశ్రమల ఏర్పాటుకు వేగం పెరిగిందని తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో అతి పెద్ద బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రాజెక్టులు ఏపీకి రావడం రాష్ట్ర పారిశ్రామిక శక్తిని పెంచిందని సర్వే గుర్తించింది.ద్రవ్యోల్బణం విషయంలో కూడా ఏపీ మంచి ఫలితాలు సాధించినట్లు నివేదిక తెలిపింది. 2023?24 ఆర్థిక సంవత్సరంలో 7.57 శాతం ఉన్న ద్రవ్యోల్బణ రేటు, 2025?26 నాటికి 1.39 శాతానికి తగ్గడం ప్రజలకు ఊరట కలిగించే అంశంగా పేర్కొంది. మొత్తం మీద ఈ ఆర్థిక సర్వే ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా స్థిరంగా, భవిష్యత్తు వైపు నమ్మకంగా అడుగులు వేస్తోందని స్పష్టంగా చూపిస్తోంది.

# ఉపఎన్నికల దిశగా అడుగులు

విజయవాడ, జనవరి 31 (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠతో సాగుతున్నాయి. అధికార కూటమి ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి మధ్య పోరు రోజురోజుకూ మరింత కఠినంగా మారుతోంది. గత దాదాపు ఇరవై నెలలుగా రాష్ట్ర అసెంబ్లీకి వైసీపీ సభ్యులు హాజరు కావడం లేదు. దీనిని అధికార పార్టీలు ఒక రకమైన అసెంబ్లీ బహిష్కరణగా అభివర్ణిస్తున్నాయి. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లోనే కాక ప్రజల్లో కూడా పెద్ద చర్చకు దారి తీసింది. ఒకవైపు వైసీపీ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా, మరోవైపు సభకు రాని పార్టీకి ఆ హక్కు ఎలా ఇస్తారని కూటమి ప్రభుత్వం ప్రశ్నిస్తోంది.నిబంధనల ప్రకారం అసెంబ్లీ సభ్యుడు అరవై పని దినాలు సభకు హాజరు కాకపోతే అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరగబోయే బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారాయి. ఈ సమావేశాలతో అరవై పని దినాల సంఖ్య పూర్తవుతుందని, అప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ), జనసేన పార్టీ , బీజేపీ ( కలిసిన కూటమి దీనిపై గట్టిగా ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.ఒకవేళ వైసీపీ ఎమ్మెల్యేలు అనర్హులైతే ఉప ఎన్నికలు తప్పవు. చట్టప్రకారం ఆరు నెలల లోపు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అప్పటికి కూటమి ప్రభుత్వం దాదాపు రెండున్నరేళ్ల పాలనను పూర్తి చేసిన దశలో ఉంటుంది. సాధారణంగా ఈ కాలంలో కొంత మేర యాంటీ ఇన్కంబెన్సీ ప్రభావం కనిపించే అవకాశముంటుంది. అయినప్పటికీ అధికార బలం, ప్రభుత్వ వనరులు కూటమికి పెద్ద అడ్వాంటేజ్‌గా మారతాయని అంచనాలు ఉన్నాయి.మరోవైపు వైసీపీ పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. ఉప ఎన్నికలు వస్తే పార్టీ ఒంటరిగా పోరాడాల్సి ఉంటుంది. పైగా "ఒకసారి గెలిచిన తర్వాత అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలను విస్మరించారు" అనే విమర్శలు ప్రచారంలో ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది. ఈ అంశాన్ని కూటమి జనంలోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఉప ఎన్నికల్లో అధికార పక్షానికే పైచేయి ఉంటుందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు.వైసీపీ కూడా ఈ పరిస్థితిని తేలిగ్గా తీసుకోవడం లేదని తెలుస్తోంది. అనర్హత వేటు పడితే ఉప ఎన్నికల్లో పార్టీకి ఎంతవరకు మద్దతు ఉంటుందనే అంశంపై అంతర్గతంగా సర్వేలు చేయించిందనే ప్రచారం ఉంది. ఆ సర్వేల్లో గతంలో ఉన్న అన్ని స్థానాలు తిరిగి దక్కే పరిస్థితి లేదన్న అంచనాలు వచ్చినట్టు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఒకవేళ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గితే అది పార్టీకి దీర్ఘకాలికంగా పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది.ఈ మొత్తం పరిణామాల మధ్య, కొందరు సీనియర్ రాజకీయ నాయకులు ఒక సూచన చేస్తున్నారు. రాజకీయ భేషజాలను పక్కన పెట్టి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చ చేయడమే వైసీపీకి ఉత్తమ మార్గమని వారు అభిప్రాయపడుతున్నారు. అలా చేస్తేనే కూటమి ఎత్తులకు సరైన ప్రత్యుత్తరం ఇవ్వగలుగుతుందని అంటున్నారు. లేకపోతే ఉప ఎన్నికలు జరిగితే కూటమికి నష్టమేమీ లేకుండా, వైసీపీకి మాత్రం ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

# తెలుగు తమ్ముళ్ల మధ్య తగవులు

## పాత నేతలు వర్సెస్ కొత్త లీడర్లు

విజయవాడ, జనవరి 31 (భారత శక్తి):

తెలుగుదేశం తన చరిత్రలోనే ఎన్నడూ లేని రీతిలో అత్యధిక సీట్లను సాధించి ఏపీలో మళ్లీ అధికారంలోకి వచ్చింది. ప్రత్యర్థి వైసీపీను నేలకరిపించడమే కాదు.. కేంద్రంలోనూ అనుకూల వాతావరణం రావడంతో ఆ పార్టీ ఎప్పుడూ లేనంత స్ట్రాంగ్‌గా ఉంది. కానీ పార్టీ కార్యకర్తల్లో ఎక్కడో ఆవేదన.. సీనియర్లలో ఎందుకో అసంతృప్తి. ఆత్మగౌరవ నినాదానికి ప్రతిరూపమైన తెలుగుదేశం సోల్.. దెబ్బతింటోందా.. అన్న ఆలోచన కల్ట్ తెలుగుదేశం అభిమానుల్లో కలుగుతోంది.తెలుగుదేశం? అత్యంత విజయవంతమైన, దేశంలోని అతిపెద్ద రీజనల్ పార్టీ. 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన తెలుగుదేశానికి కార్యకర్తలే అసలైన బలం. సైద్ధాంతిక పునాదులతో నిర్మితమైన ఆ పార్టీ కాలానుగుణంగా వస్తున్న మార్పులతో సతమతమవుతోందా అనిపిస్తోంది. కొత్త లీడర్ల ప్రవేశం.. ఇతర పార్టీ నేతల సాంగత్యం.. నేతల్లో తగ్గిపోతున్న ఎమోషన్.. ఇవన్నీ కార్యకర్తలకు కాస్త కష్టం కలిగిస్తున్నట్లుగానే ఉంది. పార్టీలోనే కొందరి సీనియర్ నేతల సణుగుళ్లు కూడా అందుకు నిదర్శనమే..!తెలుగుదేశం అనేది బలమైన భావోద్వేగాలతో నిర్మితమైన ప్రాంతీయ పార్టీ.. కార్యకర్తల్లో ఉద్వేగం.. అంకిత భావం ఎక్కువ. వ్యక్తుల కంటే పార్టీ ఎక్కువ అనే ఫీలింగ్ ఆ పార్టీకి ఇంధనం. అందుకే ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుంది. నాలుగు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా ఇంకా నిలబడగలిగింది. అయితే కాలానుగుణంగా వస్తున్న మార్పులు పార్టీ కట్టును తప్పిస్తున్నాయా అనిపిస్తోంది. ముఖ్యంగా ఈసారి ఎన్నికల తర్వాత తెలుగుదేశంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా బయటపార్టీల నుంచి తీసుకున్న నాయకుల వల్లనైతేనేమీ.. తెలుగుదేశంలో పైస్థాయి నాయకత్వం నుంచీ కిందిస్థాయి వరకూ కాలక్రమేణా జరిగిన నాయకత్వ మార్పుల వల్లనైతే నేమీ ఒకప్పటి గాఢత తగ్గిందనేది వాస్తవం.కోర్ తెలుగుదేశానికి అధికారంలో భాగస్వామ్యం దక్కడం లేదనడానికి ఓ చిన్న ఎగ్జాంపుల్ మంత్రివర్గ కూర్పే. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి మినహా.. 24మంది మంత్రులు ఉన్నారు. వీరిలో మిత్రపక్షాలకు చెందిన నలుగురూ కొత్తమంత్రులే. వారని మినహాయిస్తే.. మిగిలిన 20మంది మంత్రుల్లో పాతవారు కేవలం ఆరుగురు. అంటే మిగిలిన 14మంది కొత్తవారే. ఇందులో ఇతర పార్టీల్లోకి వెళ్లొచ్చిన వాళ్లు.. యాక్టివ్‌గా లేని వాళ్లు ఉండటం తెలుగుదేశం కార్యకర్తలకు అప్పుడే నచ్చలేదు. కొత్త నాయకత్వం పేరుతో పార్టీ ఆజెండను ఏమాత్రం అర్థం చేసుకోని వారికి అప్పగించారనే విమర్శలున్నాయి. ఇక కొంతమంది మంత్రులు "ఏ కోటాలో" మంత్రి పదవి దక్కించుకున్నారో తెలీదు కానీ .. అసలు వాళ్లకి పార్టీతో కిందిస్థాయిలో కనెక్షన్ లేదు.పార్టీని కాపాడటానికో.. లేక ఆర్థిక పరిపుష్టి కలిగించడానికో.. లేక ప్రత్యర్థి పార్టీని బలహీనపరచాలన్న లక్ష్యంతోనో కొన్ని నిర్ణయాలు జరిగాయి. వీటివల్ల తెలుగుదేశంలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్లు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. పార్టీ అధికారంలోకి వచ్చినా.. తాము గెలిచినా కూడా కొంతమంది పార్టీ నేతలు 'త్యాగం' చేయాల్సి వచ్చింది. చాలా నియోజకవర్గాల్లో పొత్తుల వల్ల అడ్జెస్ట్‌మెంట్‌లు, బయట నుంచి తీసుకున్న వారి వల్ల కలిగిన ఇబ్బందులు ఇలా అనేక రూపాల్లో కొన్నాళ్లుగా ప్రతిస్పందనలు వస్తూనే ఉన్నాయి.తెలుగుదేశంలో పార్టీని ఓన్ చేసుకుని ? పార్టీ లైన్‌పై చాలా కచ్చితంగా ఉండే నేతలు కొంతమంది ఉన్నారు. అయ్యన్నపాత్రుడు పార్టీ అధికారంలో లేనప్పుడు.. తన వాయిస్‌ను బలంగా వినిపించారు. ఇతర పార్టీల నేతలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని అంతగా ఇష్టపడరు. ఈ మధ్య ఆయన కుమారుడు కూడా నేరుగా ఇలాగే మాట్లాడారు. "వైసీపీ వాళ్లకి వంగి దండాలు పెట్టాల్సిన ఖర్మ లేదన్నారు.." టీడీపీలో మరో నేత చింతమనేని ప్రభాకర్ ఫైర్‌బ్రాండ్. పార్టీ లైన్ విషయంలో పక్కాగా ఉంటారు. ఆయనకు కూడా ఏలూరు జిల్లాలో సమస్యలు వచ్చాయి. మంత్రి పార్థసారథి కొంతమంది వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారంటూ చిరాకుపడ్డారు. పార్టీ పుట్టినప్పటి నుంచీ ఉన్న వాళ్లలో ఇప్పటికీ కొనసాగుతున్న వారిలో అయ్యన్న, బుచ్చయ్య చౌదరి ఉన్నారు. వయసు మీద పడుతున్నా తనకు మంత్రి పదవి రాకపోవడంపై బుచ్చయ్య చాలా సార్లు ఆవేదన చెంది.. ఇక తనకు రాదని డిసైడై పార్టీలో స్తబ్ధుగా ఉంటున్నారు. అయితే ఆయన కూడా ఈమధ్య కొంతమంది "జూనియర్లు" తనకే సలహాలు ఇస్తున్నారంటూ చిటపటలాడారు. పార్టీ పుట్టినప్పటి నుంచీ ఉన్న మరో నేత యనమల కూడా సైడ్‌లైన్ అయిపోయారు. ఆయన కూడా అప్పడప్పుడూ కనిపించీ.. కనిపించనట్లు అసంతృప్తి బయటపెడుతూనే ఉంటారుతెలుగుదేశం అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ఆ పార్టీ నాయకత్వం చాలా పటిష్టంగా ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు దేవేందర్ గౌడ్, ఎర్రన్నాయుడు, యనమల, అయ్యన్న వంటి సీనియర్లు పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. 2004-14 ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. పయ్యావుల, ధూళిపాళ్ల, దేవినేని రేవంత్ రెడ్డి లాంటి వాళ్లు పార్టీకి స్ట్రైకింగ్ ఫోర్సుగా ఉండేవారు. కానీ 2014 నుంచే పార్టీ ఫంక్షనింగ్‌లో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్లు పార్టీని డిఫెండ్ చేయడం మానేశారు. మంత్రి పదవి రావడం లేదన్న అసంతృప్తి వల్ల ధూళిపాళ్ల రాష్ట్ర కార్యాలయానికి రావడమే మానేశారు. తనను పక్కన పెట్టారని దేవినేని కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీ నుంచి ఏదైనా విమర్శ వస్తే.. ఇప్పుడు పార్టీ తరపున మాట్లాడటానికి వంగలపూడి అనిత తప్ప ఎవరూ లేరు. ఇంకా ఎంత దైన్యస్థితి అంటే ఏదైనా మంత్రిత్వ శాఖకు సంబంధించిన విషయాలపై ఆరోపణలు వస్తే.. అన్నింటికీ చంద్రబాబో.. లోకేషో ఆన్సర్ చేసుకోవాలి తప్పితే.. ఆ మంత్రుల జాడ ఉండదు.ఇలాంటి పరిణామాలతో పార్టీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. లీడర్ల కన్నా పార్టీనే నమ్మే కార్యకర్తలు తెలుగుదేశంలో ఎక్కువగానే ఉంటారు. అలా పార్టీతో మమేకం అయిన స్థానిక నాయకత్వంతో వాళ్లు కలవగలుగుతారు కానీ.. మిక్సిడ్ కల్చర్ వాళ్లకు కాస్త ఇబ్బందిగానే ఉంది. ఇంక కొన్ని చోట్ల అయితే పార్టీని పూర్తిగా గాలికొదిలేసి సంపాదించడమే టార్గెట్ గా ఉన్న ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఇందుకోసం అప్పటికే వాటిలో పాతుకుపోయిన వైసీపీ వాళ్లలో సెటిల్ చేసుకున్న చెట్టాపట్టాలు వేసుకోవడం టీడీపీ హార్డ్‌కోర్‌కు మింగుడు పడటం లేదు. పార్టీలో జరుగుతున్న పరిణామాల గురించి ఓ పాత నాయకుడిని కదిలిస్తే?" ఇవన్నీ చిన్న సార్‌కు.. పెద్ద సార్‌కు తెలీకుండానే జరుగుతున్నాయా..""?అన్నారు.ఏ పార్టీలో అయినా కొత్త నాయకత్వం రాక తప్పదు. అది బయట నుంచైనా రావొచ్చు.. లేక అంతర్గతంగానే మారొచ్చు. కానీ ఆ మార్పు అనేది పార్టీ ఆత్మను దెబ్బతీయకూడదు. ముఖ్యంగా ఆత్మగౌరవ నినాదంతో వచ్చిన తెలుగుదేశంలో..!

# ఆ నేతలంతా సైలెంట్...

గుంటూరు, జనవరి 31 (భారత శక్తి):

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల వైఖరి వింతగా ఉంది. వైసిపి హయాంలో చాలామంది నేతలు దూకుడుగా ఉండేవారు. సీనియర్లు మౌనంగా ఉండగా.. జూనియర్ లు విచ్చలవిడిగా మాట్లాడేవారు. నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. అటువంటి వారంతా ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. కేసుల పరంగా ఇబ్బందులు పడుతున్నారు. జైలుకు వెళ్లిన వారు ఉన్నారు. అయితే ఇలా జైలుకు వెళ్లిన క్రమంలో చాలా రోజులుగా రిమాండ్ ఖైదీలుగా ఉండిపోతున్నారు. అటువంటివారు బెయిల్ పై బయటకు వచ్చే క్రమంలో కూటమి ప్రభుత్వంపై దూకుడుగా మాట్లాడుతున్నారు. తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. వారి దూకుడు చూస్తే ఇక ప్రభుత్వంపై గట్టి పోరాటం చేస్తారని అనుకోవచ్చు. అటు తర్వాత వారు ఎందుకో సైలెంట్ అవుతున్నారు. కనీసం మాట్లాడడం లేదు కూడా. అయితే పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో వారికి సాయం దక్కకపోవడంతోనే వారు సైలెంట్ అవుతున్నట్లు తెలుస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా మాజీ ఎంపీ నందిగాం సురేష్ అరెస్టు అయ్యారు. చాలా రోజులు పాటు ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. చివరకు న్యాయస్థానంలో ఆయనకు బెయిల్ దక్కింది. అయితే సురేష్ మాత్రం ప్రభుత్వం పై ఎటువంటి ఘాటు వ్యాఖ్యలు చేయలేదు. బయటకు మాట్లాడింది కూడా చాలా తక్కువ. అయితే అరెస్టు అయిన మిగతా నేతలు కంటే తన విషయంలో అధిష్టానం పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆవేదన ఆయనలో ఉంది. బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత ఆయన చాలా ఇంటర్వ్యూల్లో మాట్లాడారు. అరెస్టయిన తన కుటుంబాన్ని పట్టించుకోలేదన్న ఆవేదన ఆయనలో కనిపించింది. అయితే నందిగాం సురేష్ విషయంలో జగన్ ఆలోచన వేరేలా ఉంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఆయనను పట్టించుకోలేదని అర్థమవుతోంది.వల్లభనేని వంశీ మోహన్ చాలా రోజులు రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో టిడిపి నుంచి గెలిచి ఆ పార్టీలోకి ఫిరాయించారు. చంద్రబాబుతో పాటు లోకేష్ లపై విరుచుకుపడ్డారు. అందుకోసమే ఆయనను వైసీపీలో చేర్పించుకున్నారు అన్న రీతిలో విమర్శలు చేసేవారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకున్నారు. జైలులో సుదీర్ఘకాలం రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఆరోగ్యం కూడా ఇబ్బందుల్లో పడింది.. బెయిల్ పై బయటపడిన అనంతరం ఆయన నేరుగా జగన్మోహన్ రెడ్డిని కలుసుకున్నారు. ఇక గన్నవరంలో ఆయన యాక్టివ్ అవుతారని.. ప్రభుత్వంపై మునుపటి మాదిరిగా విరుచుకుపడతారని అంతా భావించారు. కానీ ఆయన మాత్రం హైదరాబాద్కు మాత్రమే పరిమితమయ్యారు. కాకాని గోవర్ధన్ రెడ్డి పరిస్థితి కూడా అలానే ఉంది. బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత కేవలం మీడియా ముందు మాత్రమే ఆయన దూకుడుగా ఉంటున్నారు. మిగతా విషయాల్లో మాత్రం పెద్దగా చూసి చూడనట్టుగా ఉన్నారు.తాజాగా మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బెయిల్ లభించింది. దీంతో మీడియా ముందుకు వచ్చిన ఆయన తాను జగన్ కోసమే ఇక్కడి నుంచి బతుకుతానని ప్రకటన చేశారు. గతంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విషయంలో కూడా అదే జరిగింది. అయితే ఆయన బయటికి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డిని కలవలేదు. మునుపటి దూకుడు కూడా లేదు. మరోవైపు మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబులు తాము రెడ్ బుక్ కు భయపడలేదని చెబుతున్నారు. కానీ లోకేష్ మాత్రం రెడ్ బుక్ లో మూడు పేజీలు అయ్యాయని.. ఇంకా చాలా పేజీలు ఉన్నాయంటూ స్పష్టం చేశారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో భయం పెంచుతోంది. జైలుకు వెళ్లిన వారు నోరు తెరవడం లేదు. అరెస్టుల భయంతో ఉన్నవారు సైలెంట్ గా ఉంటున్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబు లాంటి ఒకరిద్దరు మాత్రమే మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జైలుకెళ్లి బయటకు వచ్చిన వారు నోరు తెరవడం లేదు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన సైలెన్స్ కనిపిస్తోంది.

# తమిళనాట పొలిటికల్ హీట్

చెన్నై, జనవరి 31 (భారత శక్తి):



తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయమే ఉంది. ఇప్పుడిప్పుడే పొలిటికల్ సమీకరణాలు ఊహించని విధంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా హీరో విజయ్ టీవీకే పార్టీపై ఓ అంచనాకు రాలేకపోతున్నాయట ప్రధాన పార్టీలు. మామూలుగా విజయ్ టీవీకే పార్టీకి పూర్తి స్థాయి రాజకీయ నిర్మాణం లేదు. బూత్ స్థాయి కేడర్ లేదు. అనుభవజ్ఞులైన రాజకీయ నేతల బృందం లేదు. విజయ్ తర్వాత చెప్పుకోదగ్గ మాస్ లీడర్ లేదు. అయినా సర్వేలు మాత్రం టీవీకేకు15 నుంచి 20 శాతం వరకు ఓట్ షేర్ వచ్చే అవకాశం ఉందని చెప్పడమే ప్రధాన పార్టీలకు మింగుడుపడడంలేదు.అంతేకాదు ఉత్తర తమిళనాడులో వీసీకే, పీఎంకే ఓట్లలో చీలిక రావడం జరిగితే పెద్ద పార్టీలకూ నష్టం తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే డీఎంకే, ఏఐఏడీఎంకే రెండూ జాగ్రత్తగా పరిస్థితిని గమనిస్తున్నాయి. అలాగే కమ్యూనిటీ ఓట్ల పరంగానూ టీవీకే పార్టీ ప్రభావం కనిపిస్తోందన్న విశ్లేషణలు వస్తున్నాయి. మైనార్టీ ఓటర్లు ఎక్కువగా డీఎంకే వైపే ఉంటారని అంచనా. అయితే క్రిస్టియన్ ఓటర్లలో ఒక వర్గం విజయ్ పట్ల ఆసక్తి చూపుతోందన్న చర్చ జరుగుతోంది. దీనికి తోడు, మొదటిసారి ఓటు వేయబోయే యువత, పట్టణాల్లో సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువకులు, విజయ్ సభలకు తండోపతండాలుగా తరలిరావడం కూడా ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్నాయి.ఇక్కడే రాజకీయ పార్టీలకు అసలు సవాల్ ఎదురవుతోంది. డీఎంకేకు ఏఐఏడీఎంకేతో రాజకీయంగా ఎలా పోరాడాలో తెలుసు. బీజేపీతో ఎలా వ్యవహరించాలో తెలుసు. కానీ రాజకీయాన్ని ఒక ఈవెంట్‌లా చూసే ఓ వర్గాన్ని ఎలా ఎదుర్కోవాలో మాత్రం అర్థం కావడం లేదు. కరూర్‌లో విజయ్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట తర్వాత ఇది స్పష్టంగా కనిపించింది. ఇతర పార్టీల సభల్లో జరిగే ఘటనలపై వెంటనే చర్యలు తీసుకునే ప్రభుత్వం, కరూర్ ఘటనలో మాత్రం రియాక్షన్ చాలా లేట్‌గా కనిపించింది. కారణం విజయ్ పార్టీపై ఓ అంచనాకు డీఎంకే రాకపోవడమే కారణమంటున్నారు విశ్లేషకులు.మామూలుగా విజయ్ సభలకు వచ్చే జనాలు పొలిటికల్ ఇంట్రస్ట్‌తో రావడంలేదు. ఆయనను చూడడానికి మాత్రమే వస్తున్నారు. దగ్గరగా ఉండాలని, వీలైతే ఫోటోలు, గ్రూ తీసుకోవాలన్న ఆరాటంతో వస్తున్నారే తప్ప, మరో కారణం లేదన్నది విశ్లేషకుల మాట. వారి మాటల్లో చెప్పాలంటే విజయ్ సభలు, లీడర్ -క్యాడర్ సంబంధంగా కాకుండా , హీరో -ఫ్యాన్ మధ్య సంబంధమే. అది భావోద్వేగంతో మొదలై, జనసమూహంగా మారుతోంది. విజయ్ రాజకీయాల్లోకి సిద్ధాంతాలతో అయితే రాలేదు. ఒక భావోద్వేగంతో మాత్రమే వచ్చారంటున్నారు విశ్లేషకులు. ఇప్పుడిదే తమిళనాడు రాజకీయాల్లో పెద్ద చర్చ గామారింది. అయితే విజయ్ పార్టీ మాత్రం జనసందోహాన్ని చూసి ఎన్నికల్లో తమదే విజయమని చెబుతోంది. ఇక్కడ మరో ఇంట్రస్టింగ్ పాయింట్, విజయ్ తండ్రి చంద్రశేఖర్ మాటలు. ఓవైపు రాబోయే ఎన్నికల్లో టీవీకే పార్టీదే విజయమని చంద్రశేఖర్ చెబుతూనే, కాంగ్రెస్‌తో కలిస్తే చరిత్ర సృష్టిస్తారని చెప్పడం కొసమెరుపు.కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉంది, సంప్రదాయం ఉంది, వారసత్వం ఉంది. కానీ ఇతర పార్టీలకు మద్దతు ఇస్తూ వచ్చిందనే కారణంతో క్రమంగా తన రాజకీయ బలం కోల్పోయింది. ఆ కోల్పోయిన శక్తిని తిరిగి కాంగ్రెస్‌కు ఇవ్వడానికి విజయ్ సిద్ధంగా ఉన్నాడు. కాంగ్రెస్ ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే, మరోసారి చరిత్ర సృష్టించే అవకాశం ఉందని టీవీకే అధినేత విజయ్ తండ్రి చంద్రశేఖర్ అంటున్నారు.విజయ్ తండ్రి చంద్రశేఖర్ మాటలపై తమిళనాడులో పెద్ద చర్చైతే జరుగుతోంది. మరోవైపు విజయ్ సినిమాల్లోనే హీరోఅని, రాజకీయాల్లో తాము హీరోలమంటున్నారు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి. కరూర్ ఘటనలో 41మంది చనిపోయారని, వారంతా విజయ్‌ను చూడటానికి మాత్రమే వచ్చారు కానీ, ఆయన రాజకీయ సిద్ధాంతాలు నచ్చికాదన్నారు పళనిస్వామి. 'అభిమానులు తండోపతండాలుగా రావచ్చు. అలాగని అతను రాజకీయాల్లో హీరో కాదు. జనానికి సేవ చేయాలన్నా, జనం రావాలన్నా నాతోనే సాధ్యం. టీవీకే పార్టీలా నేను పొత్తుల కోసం అటు ఇటు పరుగెట్టడంలేదు.'అన్నాడీఎంకే అధ్యక్షుడు పళనిస్వామి స్పష్టం చేశారు.మొత్తానికి టీవీకే విజయ్ పార్టీ తమిళనాడు రాజకీయాల్లో గెలిచినా, ఓడినా ప్రభావం మాత్రం ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. మరి చూడాలి పొత్తుల రాజకీయంలో విజయ్ సింగిల్‌గా దిగుతాడా, మింగిలవుతాడా అన్నది వేచి చూడాలి..!

# అమరావతి చట్టబద్ధతకు లైన్ క్లియర్

విజయవాడ, జనవరి 31 (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు లైన్ క్లియర్ అయింది. ఈ ఫైల్‌కు కేంద్ర హోంశాఖ ఇప్పటికే ఆమోద ముద్ర వేసింది. ఇక న్యాయశాఖ, పట్టణాభివృద్ధిశాఖలతో పాటు మరో రెండు శాఖల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం కేంద్ర కేబినెట్ ముందుకు రానుంది అమరావతి రాజధాని బిల్లు. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టేందుకు మోదీ సర్కార్ సిద్ధమవుతుంది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్ర రాజధానిగా ఏ ప్రాంతం ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికారం. ఇందుకు అనుగుణంగా అమరావతిని ఎంపిక చేసి, 2014లో భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాలు కూడా జరిగాయి. ఏపీలో పాలనా మార్పుతో జాప్యం జరిగింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో అమరావతి పక్కకు పోయి మూడు రాజధానుల అంశం తెరమీదికి వచ్చిందిమళ్లీ 2024లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో మరోసారి అమరావతిని రాజధానిగా ప్రకటించి పూర్తి స్థాయి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరింది.ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా.. ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని టీడీపీ కోరింది. విభజన చట్టం ప్రకారం పదేళ్ల పాటురెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంది. 2024 జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడవు ముగియడంతో ఏపీకి ప్రత్యేక శాశ్వత రాజధానిని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏ తేదీ నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ కోరింది. 2024 జూన్ 2న హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా గడవు ముగిసినందున..ఆరోజు నుంచే అమరావతిని రాజధానిగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరింది రాష్ట్రప్రభుత్వం. దీంతో విభజన చట్టానికి నోడల్ ఏజన్సీగా ఉన్న కేంద్ర హోం శాఖ అమరావతిని రాజధానిగా ప్రకటించేందుకు చర్యలు మొదలు పెట్టింది. అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి హోం శాఖ అభిప్రాయలు కోరింది.గత ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతిపై గందరగోళం ఏర్పడింది. దీంతో భవిష్యత్తులో రాజకీయ మార్పులు వచ్చినా రాజధాని మారకుండా ఉండాలంటే పార్లమెంట్ చట్టబద్ధత ఉండాలని భావిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ బిల్లు ఆమోదం పొందితే ఆంధ్రప్రదేశ్ రాజధాని వివాదానికి శాశ్వత పరిష్కారం లభించినట్లే. ఎన్డీఏ ప్రభుత్వానికి ఉభయసభల్లో పూర్తి మెజారిటీ ఉండటంతో బిల్లు ఆమోదం లాంఛనమే. అయితే ఈ బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చినప్పుడు..వైసీపీ ఎటువైపు స్టాండ్ తీసుకుంటుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# పవార్ ఫ్యామిలీ ఒక్కటవుతుందా

ముంబై, జనవరి 31 (భారత శక్తి):

ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అకాల మరణంతో మహారాష్ట్ర రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ లోని అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం విలీనం త్వరలో జరుగుతుందని భావిస్తున్నారు. పవార్ కుటుంబం తీసుకున్న చర్య దీనిని సూచిస్తుంది. అజిత్ పవార్ రాజకీయ వారసుడికి సంబంధించిన నిర్ణయం ఇప్పుడు పవార్ కుటుంబ స్థాయిలో జరుగుతుందని వర్గాలు తెలిపాయి. తదుపరి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎవరు అనేది శరద్ పవార్ నిర్ణయిస్తారని సమాచారం.ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోవడానికి రెండు కుటుంబాలు కలిసి సమావేశం కావడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ అంశంపై నేడు లేదా రేపు, అంటే రాబోయే రెండు రోజుల్లో వివరణాత్మక చర్చ జరిగే అవకాశం ఉంది. రెండు పార్టీల మధ్య విలీనం కూడా ప్రకటించవచ్చని భావిస్తున్నారు. మరోవైపు, పార్టీ ఆదేశాన్ని సునేత్రా పవార్‌కు అప్పగించాలనే డిమాండ్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల నుండి తీవ్రమైంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ప్రతిపాదన ఇవ్వడానికి ఎన్‌సిపి నాయకులు సిద్ధమయ్యారు.ఎన్‌సిపి నాయకులు అందరు కలిసి మధ్యాహ్నం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నివాసంలో కలుసుకున్నారు. ఈ విషయంలో సీనియర్ నాయకుడు ఛగన్ భుజ్‌బల్ కూడా ముఖ్యమంత్రిని కలుశారు. ఇక్కడ భవిష్యత్తు రాజకీయ వ్యూహం, నాయకత్వం గురించి చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్‌ను ఎన్‌సిపి జాతీయ అధ్యక్షుడిగా నియమించాలని ఎన్‌సిపి నాయకులు ప్రతిపాదించారు. ఇదిలావుంటే, అజిత్ పవార్ బతికి ఉంటే, మహారాష్ట్రలో పెద్ద రాజకీయ మార్పు వచ్చి ఉండేది, సన్నాహాలు కూడా పూర్తయ్యాయిమరోవైపు పవార్ కుటుంబం అంగీకరించిన పేరు భవిష్యత్ రాజకీయ నిర్ణయాన్ని నిర్ణయిస్తుందని భావిస్తున్నారు. మహాయుతి ప్రభుత్వంలో అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ఆర్థిక, ఎక్సైజ్, క్రీడా శాఖలను కూడా నిర్వహించారు. ఇప్పుడు,

# ఆ 26 కులాలకు బీసీ హోదా రద్దు

హైదరాబాద్, జనవరి 31 (భారత శక్తి):

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెడ్డి గాండ్ల సహా 26 ఇతర వెనుకబడిన తరగతుల (ఃఅ) కులాలను బీసీ జాబితా నుంచి తొలగించింది. నకిలీ ధృవీకరణ పత్రాలతో రిజర్వేషన్ల దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. మున్సిపల్ ఎన్నికల్లో ఈ సామాజిక వర్గాల వారు బీసీ రిజర్వేషన్ల కింద పోటీ చేసే అవకాశాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రెడ్డి గాండ్ల సహా మరో 26 ఇతర వెనుకబడిన తరగతుల కులాలను ఆ జాబితా నుంచి తొలగించింది. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఈ సామాజిక వర్గాల వారు బీసీ రిజర్వేషన్ల కింద పోటీ చేసే అవకాశాన్ని నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో రిజర్వేషన్ల దుర్వినియోగాన్ని అరికట్టడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.కొంతమంది అర్హత లేని వారు బీసీ సర్టిఫికెట్లను సులభంగా పొంది, రిజర్వేషన్ ప్రయోజనాలను అక్రమంగా వాడుకుంటున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారికి బీసీ-బి సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గత పదేళ్లుగా నాలుగు జిల్లాల్లో ఈ కులానికి చెందిన వారికి బీసీ సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఇప్పుడు ఆ పద్ధతిని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీ రిజర్వేషన్ల కింద కేటాయించిన స్థానాల్లో పోటీ చేయాలనుకునే ఈ 26 కులాలకు చెందిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వం సూచించింది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హత లేని ఎనిమిది మంది అభ్యర్థులు నకిలీ బీసీ హోదాను ఉపయోగించి వార్డు సభ్యులుగా గెలుపొందినట్లు వెలుగులోకి వచ్చింది. ఇది ఎన్నికల అధికారుల నిర్లక్ష్యాన్ని, అభ్యర్థుల అర్హతలను సరిగ్గా పరిశీలించడంలో ఉన్న లోపాలను బయటపెట్టింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం తాజా ఆదేశాలు జారీ చేసింది.తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేని కొన్ని సామాజిక వర్గాలు రిజర్వేషన్లను దుర్వినియోగం చేస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో సర్కార్ 26 కులాలకు బీసీ హోదాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.గాండ్ల కులం వారు సాంప్రదాయకంగా నూనె గింజలు నూరి జీవించేవారు. వీరిని బీసీ-బి వర్గంలో చేర్చారు. అయితే, రెడ్డి గాండ్ల అనే ఉప కులం కూడా ఉంది. వీరిద్దరి వృత్తి ఒకటే అయినా, 'రెడ్డి' అనే పదం వాడకం వల్ల గందరగోళం ఏర్పడుతోందని, దీనిని అడ్డం పెట్టుకుని చట్టబద్ధంగా అర్హత లేని వారు కూడా ప్రయోజనాలు పొందుతున్నారని ప్రభుత్వం అభిప్రాయపడింది.2010లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్ జిల్లాల కలెక్టర్లకు రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారికి బీసీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి అనుమతి ఇచ్చింది. ఇప్పుడు వచ్చిన ఉత్తర్వులు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయి. ఆనాటి నిర్ణయం ఒక పొరపాటు అని, అది దుర్వినియోగానికి దారితీసిందని ప్రస్తుత ఉత్తర్వులు పేర్కొన్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2014లో బీసీ జాబితాను సమీక్షించారు. అప్పుడు కళింగ, తూర్పు కాపు, గవర వంటి 26 కులాలు ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయని, తెలంగాణలో వారికి చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానిక ఉనికి లేదని గుర్తించారు. జీవో 3 (ఊ 3), 2014 ద్వారా వీరిని బీసీ జాబితా నుంచి తొలగించారు. ఈ నిర్ణయాన్ని హైకోర్టు 2016లో సమర్థించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఈ కులాలకు రిజర్వేషన్ల ప్రయోజనం కల్పించకూడదని సర్కార్ నిర్ణయించింది.

# అరచేతిలో బడ్జెట్ అప్ డేట్స్...

న్యూఢిల్లీ, జనవరి 31 (భారత శక్తి):

బడ్జెట్ వస్తున్న ప్రతీసారి "నాకేంటి లాభం" అని సామాన్యులు ఎదురు చూస్తుంటారు. ట్యాక్స్ రిలీఫ్‌లు ఉంటాయా? నిత్యవసర ధరల పెరుగుదలపై ప్రభావమెంతా..? ఏయే రంగాలకు ఉపశమనం కలుగుతుంది. ఏ రంగాలపై బాదుడు తప్పదు అన్న ఆసక్తి ఉంటుంది. ఈసారి ద్రవ్యోల్బణం నుండి ఉపశమనం లభిస్తుందా లేదా జేబుపై భారం పెరుగుతుందా? అనేదానిపై దేశ వ్యాప్తంగా బడ్జెట్ ప్రసంగం కోసం ఎదురు చూస్తుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ 2026పై అందరి దృష్టి నెలకొంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, ఉదయం 11 గంటలకు పార్లమెంటులో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. ఈ సారి బడ్జెట్‌పై సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు అందరూ భారీ అంచనాలు పెట్టుకున్నారు.టీవలే జీఎస్టీని కేంద్రం తగ్గించడంతో .. ఇప్పుడు బడ్జెట్‌లోనూ ఊరటనిచ్చే అంశాలు ఉంటాయని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో ఫిబ్రవరి చివరి రోజున బడ్జెట్ ప్రవేశపెట్టారు. కానీ అరుణ్ జైట్లీ ఆ సంప్రదాయాన్ని మార్చి ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. కానీ ఈసారి దేశచరిత్రలో తొలిసారిగా ఆదివారం నాడు ప్రవేశపెడుతుండడం గమనార్హం. బడ్జెట్ రోజున టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూడలేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ మొబైల్ ఫోన్‌లోనే బడ్జెట్‌ను ప్రత్యక్షంగా చూడొచ్చుఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం పూర్తయిన వెంటనే ప్రభుత్వం బడ్జెట్‌ను డిజిటల్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉంచుతుంది. మీరు అధికారిక వెబ్‌సైట్ తినిటతిజీఏబీటణవబి.ణనీల.తిని ని సందర్శించి బడ్జెట్ కాపీలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్‌లో ఖఆఈ ఫార్మాట్‌లో బడ్జెట్ కాపీలు అందుబాటులో ఉంటాయి. బడ్జెట్‌కు ముందు, జనవరి 29న పార్లమెంటులో 2026-27 ఆర్థిక సర్వేను సమర్పించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల శాఖ ఆర్థిక విభాగం రూపొందించిన ఈ సర్వే 2025-26లో ఆర్థిక పనితీరును సమీక్షిస్తుంది.తదుపరి ఆర్థిక సంవత్సరానికి ఒక అంచనాను అందిస్తుంది.

# ఎర్రవల్లి వర్సెస్ జూబ్లీహిల్స్

హైదరాబాద్, జనవరి 31 (భారత శక్తి):

తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో గురువారం చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత వేగంగా, నాటకీయంగా సాగాయి. గురువారం ఉదయం సిట్ అధికారులు నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయడంతో మొదలైన ఈ ప్రక్రియ, సాయంత్రానికి కేసీఆర్ ఇచ్చిన ఘాటైన సమాధానంతో కొత్త మలుపు తీసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు కోరగా, కేసీఆర్ మాత్రం తన లిఖితపూర్వక సమాధానంలో చట్టపరమైన అంశాలను ప్రస్తావిస్తూ నో చెప్పారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం చివరి దశలో ఉండటంతో తానే అభ్యర్థులకు బి-ఫారాలు కేటాయించాల్సి ఉందని, అందుకే హాజరుకాలేనని స్పష్టం చేశారు.కేసీఆర్ తన సమాధానంలో కేవలం ఎన్నికల బిజీనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను గుర్తు చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదని, వారి నివాసంలోనే విచారించాలని ఉన్న నిబంధనను ఆయన తన రక్షణ కవచంగా మార్చుకున్నారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే నివసిస్తున్నానని, అక్కడికే వచ్చి విచారించుకోవచ్చని ఆయన ఆఫర్ ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయనను జూబ్లీహిల్స్ ఏసీబీ కార్యాలయానికి రప్పించాలనే ప్రాథమిక ఆలోచనను తాత్కాలికంగా పక్కన పెట్టాల్సి వచ్చింది.కేసీఆర్ ఇచ్చిన సమాధానం కేవలం సమాచారం మాత్రమే కాదు, అందులో లోతైన న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. ఆయన నివాస స్థలం ఎక్కడ? విచారణ ఎక్కడ జరపాలి? అనే విషయాలపై స్పష్టత కోసం సిట్ అధికారులు ఇప్పుడు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. శుక్రవారం విచారణ ఉండదని స్పష్టమైపోయింది. సిట్ ఈ మేరకు కేసీఆర్ కు సమాచారం ఇచ్చింది. అయితే, తదుపరి నోటీసులు ఎప్పుడు ఇస్తారు? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకునే లోపే విచారణ ముగించాలని ప్రభుత్వం భావిస్తుందా, లేక ఎన్నికల తర్వాతే దీనిపై దృష్టి పెడుతుందా అనేది వేచి చూడాలి.బీఆర్ఎస్ ఈ నోటీసులను రాజకీయ కక్షసాధింపుగా మలిచి సానుభూతి పొందాలని చూస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అక్రమాలను బయటపెడుతున్నామనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. నామినేషన్ల చివరి రోజైన శుక్రవారాన్ని కేసీఆర్ ఎంచుకోవడం వెనుక, క్యాడర్‌లో నైతిక బలాన్ని పెంచే ఉద్దేశం కూడా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి, విచారణ వాయిదా పడటం అనేది ప్రస్తుతానికి కేసీఆర్‌కు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, సిట్ మాత్రం ప తదుపరి నోటీసుల కోసం రంగం సిద్ధం చేస్తోంది. మరో వైపు కేసీఆర్ తన సమాధానంలో కేవలం రాజకీయ కారణాలనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను కూడా ప్రస్తావించారు.సీఆర్‌పీసీ సెక్షన్ 160ని ఉటంకిస్తూ, దర్యాప్తు అధికారులు సాక్షులను లేదా విచారించాల్సిన వ్యక్తులను ఎక్కడ విచారించాలనే విషయాన్ని గుర్తు చేశారు. 65 ఏళ్లు పైబడిన వాళ్లను దివ్యాంగులను, నివసించే ప్రాంతం కాకుండా ఇతర చోట్ల విచారణ నిమిత్తం పిలవకూడదని చట్టం చెబుతోందని ఆయన తెలిపారు. చట్టం ప్రకారం 65 ఏళ్లు పైబడిన వ్యక్తిని దర్యాప్తు బృందం వారు నివసించే చోటే విచారించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నిబంధన మేరకు తనను విచారించాలనుకుంటే సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని తన నివాసానికి రావాలని పోలీసులకు సూచించారు. అధికారుల వీలును బట్టి మరో తేదీని ఖరారు చేయాలని, ముందస్తు నోటీసుతో తన నివాసానికి వచ్చి విచారణ జరపవచ్చని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశానని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నానని కేసీఆర్ తన లేఖలో నొక్కి చెప్పారు. ఈ దేశపు బాధ్యతాయుతమైన పౌరుడిగా దర్యాప్తుకు తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా దర్యాప్తు సంస్థలు అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు తాను సిద్ధమని, అయితే అది చట్టం కల్పించే వెసులుబాటు మేరకు తన ఇంట్లోనే జరగాలని ఆయన కోరారు. భవిష్యత్‌లో నోటీసులు ఏవైనా ఉంటే తన ఎర్రవల్లి నివాసానికే పంపాలని సూచించారు.

# రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక మార్పులు

నిజామాబాద్, జనవరి 31 (భారత శక్తి):

తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాల నాటి పాత పద్ధతులకు ప్రభుత్వం స్వస్తి పలికింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఎత్తైన గద్దెలపై కూర్చునే సంప్రదాయాన్ని రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై అధికారులు సామాన్యుల తరహాలోనే నేలపై టేబుల్, కుర్చీ వేసుకుని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. అద్దె భవనాల్లో నడుస్తున్న కార్యాలయాలను తక్షణమే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ఇప్పటికే గద్దెలను తొలగించి, సొంత భవనాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేశారు.తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పాత సంప్రదాయాలకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్నతాధికారుల హోదాను ప్రదర్శించే గద్దె సంప్రదాయాన్ని రద్దు చేయడంతో పాటు.. అన్ని కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకే తరలించాలని నిర్ణయించింది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించి పారదర్శకమైన పాలన అందించడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం.రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే చోట ఒక ఎత్తైన గద్దెను నిర్మించి.. దాని చుట్టూ ఎరుపు రంగు వస్త్రం కప్పడం బ్రిటిష్ కాలం నాటి ఆచారంగా వస్తోంది. డాక్యుమెంట్ల పరిశీలన సమయంలో అధికారులు ఎత్తులో కూర్చోవడం వల్ల సామాన్య ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిపై స్పందించిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హన్మంతు, రెండు వారాల క్రితమే కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఇకపై సాధారణ టేబుల్, కుర్చీ వేసుకుని నేలపైనే కూర్చొని విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఇప్పటికే ఈ గద్దెలను తొలగించారు.రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వల్ల ఖజానాపై భారీగా భారం పడుతోంది. దీనిని నివారించేందుకు ఇకపై ఏ శాఖా కార్యాలయం కూడా అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, భీమ్‌గల్ వంటి పలు ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వ భవనాలను కేటాయించాలని జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ఇప్పటికే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల కేవలం అద్దె ఆదా అవ్వడమే కాకుండా.. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించే వీలుంటుంది. పార్కింగ్ సమస్యలు, వెయిటింగ్ హాల్స్ లేకపోవడం వంటి ఇబ్బందులకు తావుండదు. నిజామాబాద్ అర్బన్ వంటి కొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతున్నప్పటికీ.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ.. డిజిటల్ సేవలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. కార్యాలయాల తరలింపు పూర్తయితే సామాన్యులకు సేవలు మరింత వేగంగా అందుతాయని భావిస్తున్నారు.

==================

# డేంజర్‌లో మేడిగడ్డ

కరీంగనర్ జనవరి 31 (భారత శక్తి):

దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జలాశయాల జాబితాలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ చేరినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ 2025 తనిఖీల ఆధారంగా దీనిని కేటగిరీ-1 అత్యంత ప్రమాదకరం కింద వర్గీకరించింది. మేడిగడ్డతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. మరమ్మతులు తక్షణమే చేపట్టకపోతే భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని, డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.దేశవ్యాప్తంగా ఉన్న జలాశయాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక గణాంకాలను వెల్లడించింది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) 2025 వర్షాకాలం తర్వాత నిర్వహించిన తనిఖీల్లో మూడు ప్రధాన జలాశయాలను 'కేటగిరీ-1' (అత్యంత ప్రమాదకరం) కింద వర్గీకరించారు. అందులోతెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ.ఈ జలాశయాల భద్రత విషయంలో తక్షణమే నివారణ చర్యలు , మరమ్మతులు చేపట్టకపోతే భారీ రిస్క్ పొంచి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. మేడిగడ్డ విషయంలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు మరియు బ్యారేజీ రక్షణ కోసం ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జాగ్రత్తలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు మరియు తర్వాత జలాశయాల భద్రతను తనిఖీ చేయడం తప్పనిసరి. 2025లో వర్షాకాలం ముందు 6,524 డ్యామ్‌లను, వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భారతదేశంలో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడిన జలాశయాలు 1,681 ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇవి కాలం చెల్లిన నిర్మాణాలు కావడంతో వీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.గతంలో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు రావడం వంటి ఘటనల నేపథ్యంలో కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణ కొనసాగుతోంది. కేటగిరీ-1 కింద వర్గీకరించడమంటే.. నిర్మాణ పరంగా అది తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటోందని అర్థం. మరమ్మతులలో జాప్యం జరిగితే దిగువన ఉన్న గ్రామాలపై దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. జలాశయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ ఉండాలని కేంద్రమంత్రి సూచించారు

# హౌసింగ్ కార్పొరేషన్ కు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బాధ్యత

ఖమ్మం, జనవరి 31 (భారత శక్తి):



పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న సర్కార్.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలోకి బదిలీ చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు తాజాగా జారీ అయ్యాయి.తెలంగాణలోని పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రతిష్ఠాత్మక పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల గూడు కోసం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ఊపందుకుంది. మరో రెండు, మూడు నెలల్లో తొలిదశ ఇండ్ల అందుబాటులోకి రానున్నాయి. ఇక రాష్ట్రంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలపైనా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వివిధ ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో ఉన్న అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను ఇక నుంచి తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోకి బదిలీ చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఆయా డబుల్ బెడ్ రూం ఇండ్లను మరింత వేగంగా నిర్మాణాలు చేపట్టే విధంగా.. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా రేవంత్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి జీవో ఎంఎస్ నంబర్ 5ను శుక్రవారం విడుదల చేశారు. గత ప్రభుత్వ హయంలో ఇతర ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించిన అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తక్షణమే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు.ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను ప్రస్తుత ఏజెన్సీల నుంచి సంబంధిత హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లకు ( పీడీలు) బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రాజెక్టులను బదిలీ చేసే బాధ్యతను జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అప్పగించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పూర్తి, కేటాయింపు ప్రక్రియలో గతేడాది మార్చి 22న విడుదల చేసిన జీవో నంబర్ 33లోని పూర్తి మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ ప్రక్రియపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటుగా జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# రంగారెడ్డిలో పీఠం...నీదా... నాదా...

రంగారెడ్డి, జనవరి 31 (భారత శక్తి):

మున్సిపల్ పీఠం నీదా నాదా అన్నట్లుగా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారం ప్రారంభిం చాయి. జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల నుండి కౌన్సిలర్ పోటీ చేసేందుకు అభ్యర్థుల నుండి పెద్ద మొత్తంలో డిమాండ్ ఉండటంతో ఈ రెండు పార్టీలు టికెట్లు కేటాయించే విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసిన కూడా ఇంకా ఎవరికీ అధికారికంగా టికెట్లు కేటాయిస్తునట్లు చెప్పలేదు. కొన్ని చోట్ల మాత్రం ప్రచారం ప్రారంభించుకోవాలని ఆశావాహులకు సూచిస్తున్నారు.మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి, ఎంఐఎం పార్టీలు కూడా తమ బలాన్ని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో గెలిచిన బిజెపి అభ్యర్థులకు ఈసారి తిరిగి టికెట్ ఇచ్చి గెలిపించుకోవడంతో పాటు జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలో కౌన్సిలర్ సీట్లను ఘననీయంగా పెంచుకోవాలని బిజెపి అధిష్టానం స్థానిక నాయకులను ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇక ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రతి చోట ఎంఐఎం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలని ఎంఐఎం అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. మున్సిపల్ పీఠాన్ని ఆశిస్తున్న ప్రధాన పార్టీలకు మన తోడు తప్పనిసరి అయ్యేలా సీట్లు సాధించాలనే ప్రయత్నంలో ఎంఐఎం నాయకులు ఉన్నారు. వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ పీఠం ఈసారి ఎవరు దక్కించుకుంటారనే దానిపై ఓటర్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. వికారాబాద్ మునిసిపల్ మొత్తం 34 వార్డులు ఉండగా 58, 117 మంది ఓటర్లు ఉన్నారు. 2020లో వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ జనరల్ మహిళకు కేటాయించగా ఈ దఫా ఎస్సీ మహిళకు కేటాయించారు. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ ఉండటంతో ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ల సన్నిహితుల్లో ఎవరో ఒకరికి ఈ పదవి దక్కనుందని ప్రచారం జరుగుతుంది. చైర్మన్ పదవి దక్కించుకోవడం ఇద్దరూ నాయకులకు సవాలుగా మారిందికాంగ్రెస్ పార్టీ తరపున చైర్మన్ రేసులో స్పీకర్ కుమార్తె అనన్య ఉన్నట్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చా రు. బీఆర్ఎస్ నుండి చైర్మన్ రేస్ లో ఎవరున్నారనే విషయంపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత పోటీలో ఉంటున్నట్లు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా ఎక్కడ ప్రకటించడం లేదు. అయితే బిఆర్ఎస్ ప్రకటించే చైర్మన్ అభ్యర్థి ఎవరనే దానిపైనే గెలుపోటములు నిర్ణయించబడతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతు న్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ బిఆర్ఎస్ చైర్మన్ గిరిని దక్కించుకోగా తదనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా చైర్మన్ అభ్యర్థి హస్తం చెంతకు చేరింది.జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో తాండూర్ పెద్ద మున్సిపాలిటీ 36 వార్డులు ఉండగా 77,110 మంది ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జరిగిన రెండుసార్లు మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ మహిళలే చైర్మన్ పీఠంపై కూర్చున్నారు. ఈసారి మాత్రం బీసీ జనరల్ కావడంతో అధికార ప్రతిపక్ష పార్టీల నుండి చైర్మన్ ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది. తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ ఉండటంతో అధికార ప్రతిపక్షాల మధ్య ఎప్పుడు రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ తో పాటు బిజెపి, ఎంఐఎంల కు కూడా బలమైన క్యాడర్ ఉంది. 2020 మునిసిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పదికి పైగా కౌన్సిల్ స్థానాలు గెలిచి అధికార పార్టీకి చెమటలు పట్టించింది.మునిసిపల్ ఎన్నికలను కూడా ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత రెండుసార్లు బీఆర్ఎస్ బల్దియా పీఠాన్ని దక్కించుకోవడంతో ఈసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం ఎలాగైనా మునిసిపల్ చైర్మన్ పదవిని అస్తగతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ తరపున చైర్మన్ రేస్ లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ నుండి మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింలు, బిజెపి నుండి యు. రమేష్ కుమార్లు పోటీలో ఉన్నారు. వీరిలో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.కొడంగల్ మున్సిపల్ 12 వార్డులు, 27,614 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ చైర్మన్ జనరల్ కావడంతో అధికార కాంగ్రెస్ లో పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఎవరు చైర్మన్ అయినా అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశతో అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుండి తాజా మాజీ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి మరోసారి చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి తనయుడు కావడం కొంత కలిసి వచ్చే అవకాశం ఉంది.ఆయనతో పాటు మరో సీనియర్ నాయకుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ గుప్తా చైర్మన్ పీఠాన్ని బలంగా ఆశిస్తున్నారు. ఈయనకు కూడా రాజకీయ నేపథ్యం ఉంది. ప్రశాంత్ గుప్తా తాత నంద్యాల వెంకటయ్య చిన్నాన్న నందారం సూర్యనారాయణ ఇద్దరు గతంలో కొడంగల్ ఎమ్మెల్యేలుగా పని చేసిన వారే. జగదీశ్వర్ రెడ్డి, ప్రశాంత్ గుప్తులు ఇద్దరు కాంగ్రెస్ వారే కావడంతో అధిష్టానం ఎవరి వైపు ముగ్గు చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. బీఆర్ఎస్ నుండి చైర్మన్ పోటీలో ఎవరున్నారనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు.పరిగి మునిసిపాలిటీ ఈసారి బీసీ జనరల్ కు కేటాయించబడింది. ఈ మునిసిపాలిటీలో 18 వార్డులు ఉండగా 27,614 మంది ఓటర్లు ఉన్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈసారి స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎలాగైనా పరిగి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే పట్టుదలతో ఉన్నారు. గెలిచే అవకాశం ఉన్న నాయకులకే కౌన్సిలర్ టికెట్లు ఇస్తున్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. గెలుపు వ్యూహం లో భాగంగానే చైర్మన్ అభ్యర్థి ఎవరనే విషయాన్ని గోప్యంగా ఉంచి ఎన్నికలకు పోతున్నారు. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ సైతం రెండోసారి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించింది. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థిగా చివన్నోళ భాస్కర్ ను ప్రకటించి ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించింది.

=========================బీబీఅఅ

# కోఠి ఏటీఎం లో కాల్పులు.. ఆరు లక్షల దోపిడి

హైదరాబాద్ జనవరి 31 (భారత శక్తి):

కోఠి ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ముందున్న ఏటీఎం వద్ద వ్యక్తిపై కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన రిషద్ అనే వ్యక్తిపై గన్ తో కాల్పులు జరిపారు. వద్ద ఉన్న రూ.6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి బులెట్ గాయం అయింది. పోలీసులకు స్పాట్లో రెండు బులెట్స్ లభ్యం అయ్ఆయి. బాధితుడిని ఆసుపత్రికి తరలించి, ఘటనా స్థలంలో సీసీటీవీ ఫుటేజ్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఘటనపై ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి వివరణ ఇచ్చారు. కోఠి లోని ఎస్బిఐ ఏటీఎం లో నగదు డిపాజిట్ చేయడానికి బాధితుడు రిషద్ వచ్చారు. రిషద్ డబ్బులు డిపాజిట్ చేయడం పై రెక్కికీ నిర్వహించి దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు నాంపల్లి కి చెందిన బట్టల వ్యాపారి. కాల్పులు జరపడం తో అక్కడే కుప్పకులాడు. ఐదు టీమ్ లతో దుండగులను ,సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గాలిస్తున్నామని అన్నారు.రిన్షద్ ప్రాణమయం లేనట్లు వైద్యులు నిర్ధారించారు

కోఠి ఏటీఎం లో కాల్పులు.. ఆరు లక్షల దోపిడి

హైదరాబాద్ జనవరి 31 (భారత శక్తి):

కోఠి ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ముందున్న ఏటీఎం వద్ద వ్యక్తిపై కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన రిషద్ అనే వ్యక్తిపై గన్ తో కాల్పులు జరిపారు. వద్ద ఉన్న రూ.6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి బులెట్ గాయం అయింది. పోలీసులకు స్పాట్లో రెండు బులెట్స్ లభ్యం అయ్ఆయి. బాధితుడిని ఆసుపత్రికి తరలించి, ఘటనా స్థలంలో సీసీటీవీ ఫుటేజ్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనపై ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి వివరణ ఇచ్చారు. కోఠి లోని ఎస్బిఐ ఏటీఎం లో నగదు డిపాజిట్ చేయడానికి బాధితుడు రిషద్ వచ్చారు. రిషద్ డబ్బులు డిపాజిట్ చేయడం పై రెక్కికీ నిర్వహించి దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు నాంపల్లి కి చెందిన బట్టల వ్యాపారి. కాల్పులు జరపడం తో అక్కడే కుప్పకులాడు. ఐదు టీమ్ లతో దుండగులను ,సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గాలిస్తున్నామని అన్నారు.రిన్షద్ ప్రాణమయం లేనట్లు వైద్యులు నిర్ధారించారు

# సీబీఐ నివేదికతో కూటమి రాజకీయాల బండారం బహిర్గతం

## భక్తుల మనోభావాలతో ఆటలాడారు, క్షమాపణలు చెప్పాల్సిందే. దేవుడే వారిని శిక్షిస్తాడు. వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి.

తుగ్గలి: జనవరి 31 (భారత శక్తి):

తిరుపతి టీటీడీ లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ నివేదిక వెలువడిన నేపథ్యంలో అధికార కూటమిపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు.లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ స్పష్టంగా పేర్కొనడంతో,ఈ మొత్తం వివాదం రాజకీయ దురుద్దేశంతోనే సృష్టించారని వైసీపీ నేతలు ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ కావాలనే తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు.మండల కేంద్రమైన తుగ్గలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకున్న దుర్బుద్ధి చంద్రబాబుకే సొంతం అన్నారు.టీటీడీ లడ్డులో పంది కొవ్వు కలిసిందంటూ ప్రచారం చేసి భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారని,చంద్రబాబు మాట విని దుర్గగుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మళ్లీ వచ్చి మెట్లు కడిగి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.గత ఏడాది వరదల సమయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే టీటీడీ లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.సీబీఐ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఒక్క కూటమి నేత కూడా మాట్లాడలేని పరిస్థితి వచ్చిందన్నారు.టీటీడీ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు.టీటీడీ లడ్డూ అంశంపై చంద్రబాబు,పవన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని,సనాతన ధర్మం పేరుతో అపచారం చేసి భక్తుల్లో ఆందోళనలు సృష్టించారన్నారు.సీబీఐ స్పష్టంగా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చినా కూడా కూటమి నేతలకు సిగ్గు రావడం లేదని మండిపడ్డారు.చంద్రబాబు,పవన్ కళ్యాణ్ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో చెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలని,అలిపిరి మెట్లు కడిగినంత మాత్రాన వారికి ప్రాయశ్చిత్తం కాదని వ్యాఖ్యానించారు.చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.....ఈ సందర్భంగా శనివారం రోజున వైసీపీ నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో తుగ్గలిలోని చెన్నకేశవస్వామి వద్ద శ్రీనివాస్ రెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల మనోభావాలు కాపాడాలని,తప్పుడు ప్రచారాల నుంచి దేవాలయాలను రక్షించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి,వైసిపి తాలూకా ఐటి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీటీసీ రాజు,మాజీ సర్పంచ్ లు పురుషోత్తం, దేవరాజు,వార్డు మెంబర్లు, వైసీపీ సీనియర్ నేతలు,వైసీపీ నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా -నేడు ఆమె వర్ధంతి

( పెంద్యాల రామ్ కుమార్, మంథని )

అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మరియు ఇండో-అమెరికన్ మహిళ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన కల్పనా చావ్లా కొలంబియా స్పేస్ షటిల్ ప్రమాదంలో మరణించి నేటికి సరిగ్గా 23ఏళ్లు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ కొలంబియా నౌక ప్రమాదానికి గురికావడంతో అమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు ప్రాణాలు కోల్పోయారు. కల్పనా చావ్లా 1962 మార్చి 17 న హరియాణాలోని కర్నాల్‌లో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. లింగవివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహ. చిన్ననాటి నుంచే ఆకాశంలో విహరించాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1980లో అమెరికా వెళ్లారు.టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. అదే ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్-ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్-ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్షయానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు




గడిపి 80 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించారు.ఆ తర్వాత యాత్ర ముగించుకుని వస్తుండగా 2003 ఫిబ్రవరి 1 న కొలంబియా వ్యోమనౌక కూలిపోవడంతో ఆమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ జీన్ పియరీ హ్యారీసన్‌ను 1983లో కల్పన వివాహం చేసుకున్నారు. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కారాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోంది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అందజేస్తుంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు.

# రైలు కింద పడి ముగ్గురు ఆత్మహత్య

చర్లపల్లిఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ డౌన్ లైన్‌లో శనివారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది.



రైలు కింద పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. శనివారం ఉదయం సుమారు 2.30 గంటల సమయంలో చర్లపల్లి సెక్షన్ పరిధిలోని కిలోమీటర్ నంబర్ 206/48 వద్ద గూడ్స్ రైలు లోకో పైలట్ వాకీటాకీ ద్వారా సమాచారం అందించారు. రైల్వే పట్టాలపై ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఐపీఎఫ్, చర్లపల్లి, ఏఎస్ఐపీఎఫ్ బిఎస్.రావు, జీఆర్‌పీ సిబ్బంది శ్రీ సాయి ఈశ్వర్ గౌడ్, మాదవ్ (ఎస్ఐ) ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైల్వే పట్టాల మధ్యలో మూడు మృతదేహాలు తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు గుర్తించారు. మృతులను బోడుప్పల్, హరితవనం కాలనీకి చెందిన పిన్నింటి విజయ శాంతి రెడ్డి (38), విజయశాంతి రెడ్డి కుమారుడు విశాల్ రెడ్డి, కూతురు చైతన్య రెడ్డి లుగా గుర్తించారు. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారం ప్రకారం ఇది ఆత్మహత్య ఘటనగా పోలీసులు భావిస్తున్నారు. మృతుల వద్ద ఎలాంటి రైల్వే ప్రయాణ టికెట్లు లేకపోవడంతో పాటు విలువైన వస్తువులు కూడా లభించలేదని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ఆర్పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా జాయింట్ అబ్జర్వేషన్ రిపోర్ట్ తయారు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జీఆర్‌పీ సికింద్రాబాద్ క్రైమ్ నంబర్ 57/2026 కింద బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గోవధ జరుపుతున్నారని గ్రామస్తుల ఫిర్యాదుతో బిజెపి పార్టీ శ్రేణుల ఆందోళన

ఖమ్మం జనవరి 31 (భారత శక్తి):

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం పంచాయతీ రామ గోవిందాపురం రేకుల షెడ్ లో కొందరు వ్యక్తులు అక్రమంగా గోవులను బంధించి గోవధ జరుపుతున్నారని గ్రామస్తులు బిజెపి పార్టీ వారికి ఇచ్చిన సమాచారంతో బిజెపి పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగటంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు షెడ్ ని పరిశీలించి 35 పైగా ఉన్న ఆవులను,ఎద్దులను,లేగ దూడలను పోలీస్ స్టేషన్ కు వ్యాన్ లలో తరలించారు

# తాడేపల్లిగూడెంలో వైకాసా నిరసన

తాడేపల్లిగూడెం...చంద్రబాబు, పవన్ కళ్యాణ్ శ్రీవారి లడ్డుపై చేసిన దుష్ప్రచారానికి పరిహారంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కలియుగ వెంకటేశ్వర స్వామి భక్తులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలన్నారు. నోటికొచ్చినట్లుగా లడ్డులో పంది కొవ్వు కలిసిందని హిందువులు మనోభావాలు దెబ్బతినే విధంగా ఈ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అని మాట్లాడుతున్నారో సుప్రీం కోర్టు, సీబీఐ, సిట్ లడ్డులో ఏ కల్తీ లేదని రిపోర్ట్ ఇచ్చారో దానికి సమాధానం చెప్పాలన్నారు. మైలు అయిందంటూ గుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పి మళ్ళీ రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాల మెట్లు కడగాలన్నారు. విష ప్రచారం చేసిన ఈ కూటమి నాయకుల భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఆ భగవంతుడు చూస్తాడన్నారు. ప్రపంచం వ్యాప్తంగా ఉన్న హిందువులు మనోభావాలు దెబ్బతీసే విధంగా ఈ కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు.లడ్డులో ఎంత పవిత్రత ఉందో ఈరోజు తేటతెల్లం అయిందన్నారు. పాపం జరిగిందని ప్రజల్ని నమ్మించేందుకు ఆరోజు పవన్ కళ్యాణ్ దేవాలయం మెట్లు క్రింద నుండి పైకి కడిగారని, ఈరోజు అది అబద్ధం అని తేలింది కాబట్టి పైనుండి క్రిందకి పవన్ కళ్యాణ్ తిరుమల మెట్లు కడగాలన్నారు.జగన్మోహన్ రెడ్డి మీద వేసిన బురదని ఆ వెంకటేశ్వర స్వామి వారే కడిగేసారన్నారు.కూటమి నాయకులు చేసిన పాపానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

# పిప్పిరి గ్రామంలో రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 31 (భారత శక్తి)

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పరిధిలోని రైతు వేదిక పిప్రి నందు రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టా పాసుబుక్ కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 11 అంకెల రైతు ఐడి నంబర్ జారీ చేయబడుతుందని తెలిపారు. ఈ రైతు ఐడీ వ్యవసాయానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, పంట బీమా పథకం తదితర అన్ని స్కీములకు ప్రామాణికంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రైతులు పట్టాదార్ పాసుబుక్, ఆధార్ కార్డు మరియు ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ద్వారా రైతు వేదికలో ఉచితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, లేకపోతే మీసేవ కేంద్రంలో రూ.15 ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి క్రిష్ణపాల్‌తో పాటు రైతులు కిరణ్, మడవి లక్ష్మణ్ చంద్రశేఖర్, సోనాబాయి, కోసుబాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లోనే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి ప్రజావాణిలో NHRC, సామాజిక కార్యకర్తల వినతి

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 31(భారత శక్తి)



ఆదిలాబాద్ జిల్లా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం ప్రతిపాదించిన యూనివర్సిటీని నిర్మల్ జిల్లాలో కాకుండా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (చీఎ=జ) ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చీఎ=జ ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసి, గిరిజన, లంబాడా జనాభా అధికంగా ఉండటంతో పాటు వేలాది మంది విద్యార్థులు నివసిస్తున్నారని తెలిపారు. ఉన్నత విద్య కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సి రావడం వల్ల విద్యార్థులు ఆర్థిక భారంతో పాటు రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో జరిగిన సభలో యూనివర్సిటీని నిర్మల్‌కు కేటాయిస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా భౌగోళికంగా విస్తీర్ణంగా ఉండటంతో పాటు అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ప్రాంతమని, ఇక్కడే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే విద్యాభివృద్ధి వేగవంతమవుతుందని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మల్ జిల్లాకు సమీపంలో నిజామాబాద్‌లో తెలంగాణ యూనివర్సిటీ అందుబాటులో ఉండగా, ఆదిలాబాద్ విద్యార్థులకు అది దూరంగా ఉండటం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించాలన్నా, సమాన విద్యావకాశాలు కల్పించాలన్నా ఆదిలాబాద్ కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయడం అత్యవసరమని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్, గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్, చీఎ=జ మండల చైర్మన్ నర్సింగ్ దాస్, కృష్ణ, శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్త సోలంకి ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచులు, సర్పంచ్ అభ్యర్థులు రాజేందర్, గంగాధర్, జితేందర్, సుశీల్‌తో పాటు విద్యార్థులు జె. శ్రీనివాస్, విగ్నేష్, రాథోడ్ శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు న్యాయం చేయాలంటూ తమ వినతిని ప్రభుత్వం సానుకూలంగా పరిగణలోకి తీసుకోవాలని వారు కోరారు.

# 92 శాతం సాధించిన ఉత్పత్తి : ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్




మణుగూరు, జనవరి 31 (భారతశక్తి): ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 68 వేలు టన్నులకు గాను 9 లక్షల 78 వేల 932 టన్నుల బొగ్గుఉత్పత్తి చేయడం జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. శనివారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ.. జనవరి నెలలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని తెలిపారు. 01 ఏప్రిల్, 2025 నుండి 30 జనవరి, 2026వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 94 లక్షల 5 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 87 లక్షల 87 వేల 749 న్నులు, 93 శాతం సాధించమన్నారు. ఈ నెలలో 11 లక్షల 58 వేల 484 టన్నుల బొగ్గును రవాణా చేశామన్నారు. 01 ఏప్రిల్, 2025నుండి 30 జనవరి, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ గా 88 లక్షల 7 వేల 288 టన్నులు రవాణా చేయడం జరిగిందన్నారు. ఈ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 17 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 88 % తో 15 లక్షల 04 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం బి. శ్రీనివాస చారి, ఏరియా రక్షణ అధికారి వెంకట రామరావు, ప్రాజెక్టు అధికారి పి.కె. ఓసి ఎం. రమేశ్, ఏజిఎం (ఐఈడి) సిహెచ్ రాంబాబు, ప్రాజెక్టు అధికారి మణుగూరు ఓసి ఈ. శ్రీనివాస్, జిఎం (ఫైనాన్స్) ఎం. అనురాధ, డిజిఎం(సివిల్) శివ ప్రసాద్, డివై.సిఎంఓ జ్యోతిర్మై, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని శ్రీమతి కల్లేపల్లి స్వప్నా, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'రోడ్డు భద్రతా 2కె రన్'




ఆదిలాబాద్ జిల్లా, జనవరి 31 (భారత శక్తి):

రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ,నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా పట్టణంలో '2కె రన్' నిర్వహించారు. ఈ పరుగు స్థానిక ఆర్.టి.ఓ. కార్యాలయం నుండి ప్రారంభమై ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డు భద్రతా నినాదాలతో చేపట్టిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్బంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు లక్షల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని, విద్యార్థులు, యువత, ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, విద్యార్థులు తమ తల్లితండ్రులకు, బంధుమిత్రులకు రహదారి భద్రత అవగాహన కల్పించాలని సూచించారు. నెల రోజుల పాటు రవాణా శాఖ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ అధికారులను అభినందించారు. తదుపరి 2కే రన్‌లో విజేతలకు, అతిథులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉప రవాణా కమిషనర్ రవీందర్ కుమార్, డివైఎస్ఓ శ్రీనివాస్ గారు, జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా రవాణా అధికారి ఎస్.శ్రీనివాస్, విద్యార్థులు, యువత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 31 ( భారతశక్తి)జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శనివారం సాయంత్రం, కలెక్టరేట్ లోని వీసీ హాలు నుంచి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను తర్వాతగతిన పూర్తి చేయాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ లు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. బిఎల్ఓ లు రోజువారీగా చేపట్టి ప్రోజెని మ్యాపింగ్ వివరాలను తమకు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బిఎల్ఓ లకు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎబిఎల్ఓ లు సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ లలో ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బూత్ లకు చెందిన బిఎల్ఓ లు అందరూ సమన్వయం చేసుకుంటే ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. నిర్ణిత గడువులోగా ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ హైదరాబాద్ ఎక్స్‌పోజర్ విజిట్ కు తరలివెళ్లిన పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు



హైదరాబాద్, భారతశక్తి ప్రతినిధి, జనవరి 31:

జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల జీవితాల్లో ఆశల దీపం వెలిగించే వినూత్న కార్యక్రమానికి తొలిసారి శ్రీకారం చుట్టింది. శనివారం దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో ఒకటైన ఐఐటీ హైదరాబాద్ కు పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఎక్స్‌పోజర్ విజిట్ జీహెచ్ఎంసీ తీసుకెళ్ళింది.

)ప్రతి సర్కిల్ నుంచి ముగ్గురు చొప్పున సుమారు 180 మందిని 6 బస్సు ల ద్వారా ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ సందర్శనకు జీహెచ్ఎంసీ అధికారులు తీసుకెళ్లనున్నారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ విజిట్ కొనసాగుంది. ఈ విజిట్ ద్వారాఐఐటీ అధ్యాపకులు, విద్యార్థులతో పరస్పర చర్య, అకడమిక్ భవనాలు, గ్రంథాలయాలు, ఇన్నోవేషన్ సెంటర్ల సందర్శన, ప్రేరణాత్మక సమావేశాల ద్వారా ఈ పిల్లలకు ఒక ప్రపంచ స్థాయి విద్యా వాతావరణాన్ని జీహెచ్ఎంసీ పరిచయం చేయనుంది. చాలా మంది పిల్లలు తొలిసారి ప్రపంచ స్థాయి విద్యా సంస్థను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్‌లోని ఈ–సెల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ నిర్వహిస్తుంది.

రవాణా, భోజనం, భద్రత, మార్గదర్శక సహాయం వంటి అన్ని ఏర్పాట్లు ప్రత్యేకంగా చేపట్టి, ప్రతి పిల్లవాడికి ఆత్మవిశ్వాసం కలిగించేలా జిహెచ్ఎంసి చర్యలు తీసుకుంటుంది. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ ఎక్స్పోజర్ విజిట్ కు తీసుకెళుతుండడం పట్ల జిహెచ్ఎంసినిపలువురు ప్రశంసిస్తున్నారు.

# సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి,జనవరి 31 :

శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1వ తేదీ నుండి 28వ తేదీ వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్--1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఇతర వ్యక్తులను గానికి, రాజకీయ పార్టీలను గాని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పేటిన చట్ట రిత్య కఠిన చర్యలు తప్పవని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.

# పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బద్వేల్ అసెంబ్లీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారిశెట్టి సుప్రజ



పోరుమామిళ్ళ భారతశక్తి ప్రతినిధి, జనవరి 31: పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధిలో అసెంబ్లీ మార్కెట్ చైర్మన్ మాట్లాడుతుప్రధాని నరేంద్ర మోడీ ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక చేపట్టిన "పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పంపిణీ కార్యక్రమము శనివారం ఒకరోజు ముందుగానే ప్రారంభం అయినది.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద రూ 4 వేలు పెన్షన్ అందిస్తోంది. బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుప్రజ పెన్షన్ లబ్ధిదారులందరికీ ఒకరోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్న సుప్రజ టిడిపి, బీజేపీ, యంజూ నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు, గ్రామస్తులు, పెన్షన్ల లబ్ధిదారులు, తదిపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముజ్గి మల్లన్న జాతర ఏర్పాట్లను పరిశీలించిన నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 31 (భారతశక్తి) జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు, ఈరోజు నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ రూరల్ మండలంలోని ముజ్గి గ్రామాన్ని సందర్శించి, రేపటి నుండి ప్రారంభమయ్యే మల్లన్న జాతర ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మల్లన్న స్వామి ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, గుంపు నియంత్రణ (క్రౌడ్ మేనేజ్మెంట్), ట్రాఫిక్ నియంత్రణ, అలాగే భక్తులకు అందించాల్సిన సౌకర్యాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ...మల్లన్న జాతర సందర్భంగా కఠిన బందోబస్తు, సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, భక్తులు ప్రశాంతంగా జాతరను నిర్వహించుకునేలా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ పరిశీలనలో నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్. తో పాటు,రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ లింబాద్రి, ఇంకా పోలీసు సిబ్బంది ఉన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం : ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి భారతశక్తి ప్రతినిధి,జనవరి 31 :

మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని 32, 33 వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల బాకీ కార్డులను పంపిణీ చేస్తూ, ఇప్పటివరకు అమలుకాని హామీలను ప్రజలకు గుర్తు చేశారు. కాంగ్రెస్ హామీలు అమలుకావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి రాజనర్సు, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, అభ్యర్థులు నాయికోటి నవీన్, గోవర్ధన్ నాయక్, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రామిక విప్లవ స్ఫూర్తి దాత గద్దర్

## గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర

### అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్..



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 31( భరత శక్తి): పీడిత శ్రామిక వర్గాల ఉద్యమ శిఖరం ప్రజా యుద్ధనౌక గద్దర్ అని గిరిజన సామాజిక చైతన్యం వేదిక వ్యవస్థాపకులు గుగులోతు కిషన్ నాయక్ అన్నారు.శనివారం గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దరన్న 78వ జయంతిని స్థానిక బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ప్రజా సంఘాలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో దోపిడీకి గురి అవుతున్న పీడిత శ్రామిక వర్గాల కోసం తన ఆట పాట గజ్జ గొంగళితో అనేక రాష్ట్రాలు తిరిగి రాజ్యాంగ లోని హక్కుల కోసం చట్టాల అమలు కోసం దోపిడీ లేని సమాజం కోసం, వివక్షత లేని సమాజం కోసం,అణగారిన వర్గాల పక్షాన వేలాదిమంది యువతను చైతన్య పరిచితన తన ప్రజా పోరాటాన్ని తుది శ్వాస వరకు ప్రజలలో తీసుకువెళ్లిన గొప్ప శ్రామిక విప్లవ స్ఫూర్తి దాత గద్దర్ అని కొనియారు, అంతేకాకుండా తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన వదిలేసి సమ సమాజ స్థాపన కోసం, నవ సమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ భూధ్య నాయక్,

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సామా పాపయ్య,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి,చేపూరి గణేష్, ఇస్లాపురం ఉపసర్పంచ్ ఏనుగుల రాకేష్, లింగంపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి హారతి వైభవంగా జరగాలి: కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాచలం, జనవరి 31 (భారతశక్తి): మాఘ పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) ఆదివారం ఫిబ్రవరి 01వ తేదీన దివ్య క్షేత్రం భద్రాద్రి గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహిస్తున్న గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం గోదావరి కరకట్టల దగ్గర నదీ హారతి నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పూర్తి అయిపోయిన తర్వాత ప్రతి ఆదివారం గోదావరి ఘాట్ లో అర్చక స్వాములు మరియు భక్తుల సమక్షంలో నదిహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నందున భక్తులు, ప్రజల నుంచి స్పందన వచ్చిందన్నారు. మాఘ పౌర్ణమి ఆదివారం నిర్వహించే గోదావరి హారతి కార్యక్రమాన్ని సాయంత్రం ఐదు గంటల నుండి 5:30 వరకు చిన్నారులతో మంచి భజన కార్యక్రమము, భక్తి గీతాలతో భక్తులకు అలరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, అనంతరం అర్చక స్వాములు గోదావరి నది హారతి శ్రీ సీతారామ చంద్రులు వారి జపం చేసుకుంటూ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్య క్షేత్రంలో నదిహారతి కార్యక్రమం జరుగుతున్నందున భద్రాచలంలోని భక్తులే కాకుండా జిల్లా వాసులు, ఆసక్తి ఉన్నవారు అందరూ నదిహారతి కార్యక్రమంలో పాల్గొన్నలన్నారు. నది హారతి ముగిసిన వెంటనే భక్తులకు ప్రసాదాలు అందించడానికి దాతలు ముందుకు వస్తున్నందున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం నదిహారతి కార్యక్రమం నిర్వహించే విధానం గురించి నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల ప్రశంసలు పొందే విధంగా గోదావరి హారతి నిర్వహించాలని నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పంచాయితీ సర్పంచ్ పూనెం కృష్ణ, గ్రామ పంచాయితీ ఈవో శ్రీనివాసరావు, దేవస్థానం ఈఈ రవీందర్, పురోహితులు రామావఝుల రవికుమార్, పవన్ కుమార్ శర్మ, అశోక్ కుమార్ శర్మ, సరస్వతి శిశు మందిర్ ఉపాధ్యాయులు, భద్రాద్రి క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ సభ్యులు, భద్రాద్రి కా మహారాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కిటెక్చర్ కోర్సు, కెరీర్ అవకాశాలపై అవగాహన



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 31 :

ఆర్కిటెక్చర్ విద్య, కెరీర్ అవకాశాల గురించి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించే లక్ష్యంతో, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (జీఎస్ఏ) డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026 వరకు పలు ఔట్ రీచ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది.మదీనగూడలోని జెన్ సిస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చరల్ మోడల్స్, డ్రాయింగులు, ముఖాముఖి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే ఆచరణాత్మక, సృజనాత్మక అన్వేషణను ప్రోత్సహించే మండల ఆర్ట్ వర్క్షాపును కూడా నిర్వహించారు. మొత్తం 168 మంది జెన్ సిస్ విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ తరువాత, శ్రీ స్వామినారాయణ గురుకుల్ నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య బాలురు (వివిధ సెషన్లలో 300, 500, 300 మంది), బాలికల (855 మంది) కోసం వరుస ఔట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణ అభవాలను, ఆర్కిటెక్చర్ విద్యపై ఆచరణాత్మక అవగాహనను, డిజైన్ ఆలోచనను పెంపొందించడంతో పాటు విభిన్న కెరీర్ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ గీతం ఆర్కిటెక్చర్ అధ్యాపకులు ఆర్.అభిషేక్ కుమార్ సింగ్, ఆర్.స్నిగ్ధరాయ్ సమన్వయం చేశారు. ఇవన్నీ గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ యొక్క విద్యాపరమైన అవగాహన, కెరీర్ మార్గదర్శనం పట్ల నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

# సూపర్వైజర్లు, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి:జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 31:

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్వోలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీ సిద్దేశ్వర స్వామి జాత్ర ఉత్సవాలు.

హోళగుంద మండల కేంద్రంలో స్థానిక కొండ గుహలో స్వయంభువుగా వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి జాత్ర ఉత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో వైభవంగా ముగిశాయి.ప్రధానంగా చివరి రోజు అయిన శుక్రవారం శ్రీవారి సన్నిధిలో స్వామివారికి ఉదయం నుంచి వంశపారంపర్యం ఆలయ ధర్మకర్త రాజా పంపన్న గౌడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి కొట్టురు బసవేశ్వర స్వామి దేవాలయం వరకు స్వామివారి ఉత్సవ విగ్రహ మూర్తులను పూల పల్లకిలో ఉంచి,మేళా తాళతో, సకల వాయిద్యాల నడుమ పురవిధుల గుండా ఊరేగింపుగా తరలి వెళ్లారు.అనంతరం స్థానిక బస్టాండ్ నందు గల కళ్యాణ మంటపంలో స్వామివారి పల్లకిని ఉంచి స్వామివారి ఉత్సవ విగ్రహ మూర్తిని పెద్ద బావికి తీసుకెళ్లి అక్కడ జలభిషేకం చేసి మహామంగల హారతి సమర్పించి తదనంతరం టపాసులు కాల్చి స్వామివారి పూల పల్లకిని అర్చకుల ఇంటికి చేర్చారు.ఈ కార్యక్రమంలో శివశంకర్ గౌడ,అమర గౌడ,సిద్దార్థ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## ప్లానింగ్ రివర్స్?




నేచురల్ స్టార్ నాని నటిస్తోన్న 'ది ప్యారడైజ్'పై భారీ హైప్‌క్రియేట్ అయ్యింది. శ్రీకాంత్ ఓదెల రూపొందిస్తున్న ఈ సినిమాపై అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుస్తున్నారు. అయితే, ఈ చిత్ర షూటింగ్ లేట్ కావడంతో నాని ప్లాన్స్ అన్నీ రివర్స్‌అయ్యినట్టు తెలుస్తోంది. సాధారణంగా బ్రేక్ ఎక్కువగా తీసుకోకుండా మూవీలు చేసే నాని, ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనుల జాప్యం వల్ల కొన్ని వారాల పాటు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. దర్శకుడు ఈ చిత్రాన్ని చాలా భారీ స్థాయిలో ప్లాన్ చేస్తుండటంతో మేకింగ్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం పడుతోంది. దీని వల్ల 'ది ప్యారడైజ్' రిలీజ్‌తేదీ కూడా మారినట్లు సమాచారం. వాస్తవానికి మార్చిలో రావాల్సిన ఈ సినిమా, షూటింగ్ ఇంకా పెండింగ్‌లో ఉండటంతో ఇప్పుడు జూన్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మే నాటికి షూటింగ్ పనులు పూర్తి కావచ్చని టాక్. అయితే 'ది ప్యారడైజ్' ఆలస్యం ప్రభావం సుజీత్ దర్శకత్వంలో నాని చేయాల్సిన 'బ్లడీ రోమియో' ప్రాజెక్టుపై కూడా పడింది. ఈ ఏడాది ప్రారంభంలోనే మొదలవ్వాల్సిన ఈ మూవీ షూటింగ్ ఇప్పుడు ఆరు నెలలు వెనక్కి వెళ్లింది.

## అదే నా భవిష్యత్తు




ఇళయ దళపతి విజయ్ లాస్ట్ మూవీ జన నాయగన్ రిలీజ్‌పై ఇంకా క్లారిటీ రాలేదు. సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ బెంచ్ తీర్పును మద్రాస్ హైకోర్టు రీసెంట్‌గా రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మూవీ రిలీజ్ మరింత ఆలస్యం కానుంది. దీనిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో హీరో రియాక్ట్ అయ్యాడు. ఇది తాను ఊహించిందేనని చెప్పాడు. తన రాజకీయ ప్రవేశం వల్ల ఈ మూవీకి ఇబ్బందులు తప్పడం లేదన్నాడు. అయితే తన నిర్మాత పట్ల బాధగా ఉందన్నాడు. పాలిటిక్స్ కారణంగా మూవీస్ ఇంపాక్ట్ అవుతాయని ఊహించి మానసికంగా సిద్దంగా ఉన్నట్లు వెల్లడించాడు. తాను దశాబ్దాలుగా సినీ రంగంలో ఉన్నానని, ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టం చేశాడు. ఒక స్పష్టమైన లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పిన విజయ్.. ఇకపై రాజకీయాలే తన భవిష్యత్తు అని చెప్పాడు.

## సోషల్ మీడియా వాడొద్దనుకున్న

బాలీవుడ్‌అందాల తార అలియా భట్ వరుస మూవీలతో ఫుల్‌బిజీబిజీగా ఉంటోంది. ఇప్పటికే డార్లింగ్, జిగ్రా వంటి చిత్రాలతో నిర్మాతగానూ నిరూపించుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం 'డోంట్ బీ షై' మూవీని తీర్చిదిద్దుతోంది. అలాగే శివ్ రావైల్ దర్శకత్వం వహించిన హైఆక్టేన్ యాక్షన్ థ్రిల్లర్ ఆల్ఫాలో కనిపించనుంది. ఈ చిత్రంలో, ఆమె శార్వరి వాఘ్‌తో పాటు ఒక ఉన్నత మహిళా పోరాట యూనిట్‌లో కమాండింగ్ ఆఫీసర్‌గా నటించనుంది. ఇక నటుడు రణబీర్ కపూర్‌తో పెండ్లి తర్వాత వ్యక్తిగత జీవితంపై కూడా ఫుల్ ఫోకస్‌చేస్తోంది. మొదటి బిడ్డ రాహాకు జన్మనిచ్చాక మాతృత్వం అనుభూతిని పూర్తిగా ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో అలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాహాకు తల్లి అయిన తర్వాత తన సోషల్ మీడియా డిలీట్‌చేయాలనుకుంటున్నట్లు పేర్కొంది. 'తల్లి అయ్యాక నేను ఎంతో మారిన. నా ఆలోచనలు పూర్తిగా చేంజ్ అయిపోయాయి. కొన్ని రోజులైతే లేచిన వెంటనే సోషల్ మీడియాను పూర్తిగా డిలీట్ చేయాలనిపిస్తుంది. కేవలం నటిగా మాత్రమే ఉండాలని అనిపిస్తుంది. కానీ ఈ సోషల్ మీడియా లేకపోతే నాకు మొదటి నుంచీ మద్దతుగా నిలిచిన అభిమానులతో దూరమవుతానేమో అనే భయం కూడా ఉంది. ఇప్పుడు నా ఫోన్ గ్యాలరీ మొత్తం రాహా ఫొటోలతోనే నిండి ఉంటుంది. పిక్స్ తీయాలంటే ప్రత్యేకంగా ప్రయత్నించాల్సి వస్తోంది. మాతృత్వం అనేది నా జీవితంలో వచ్చిన అతిపెద్ద మార్పు. నా శరీరం, నా మనసు అన్నీ పూర్తిగా మారిపోయాయి' అంటూ చెప్పుకొచ్చింది. బాలీవుడ్ స్టార్ తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినిమా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## ఈ వారం ఓటీటీలో 30కు పైగా క్రేజీ చిత్రాలు..

## థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్‌లు





బాక్సాఫీసు వద్ద ఘన విజయాన్ని అందుకున్న 'ధురంధర్' ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా హిందీతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో అందుబాటులోకి వచ్చింది . థియేట్రికల్ వెర్షన్ రన్‌టైమ్‌ను తగ్గించి ఓటీటీలో 3 గంటలా 25 నిమిషాలతో సినిమాను తీసుకొచ్చారు.




బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దల్ దల్'. అమిత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా హిందీతో పాటు, తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది. సీరియల్ కిల్లర్‌ను పట్టుకోవడానికి ఓ పోలీస్ ఆఫీసర్ చేసే సాహసోపేతమైన ప్రయత్నాల ఇతివృత్తంగా ఈ సిరీస్ రూపొందుతోంది. ఆదిత్య రావల్, సమర టిజోరి, గీతా అగర్వాల్, అనంత్ నారాయణ్, తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



నివిన్ పోలీ కీలక పాత్రలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'సర్వం మాయ'. అఖిల్ సత్యన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు జియో హాట్‌స్టార్ వేదికగా మలయాళంతో పాటు, తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది.



రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' . డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి సందడి చేసిన ఈ సినిమా ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చింది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, హైపర్ ఆది తదితరులు కీలక పాత్రలు పోషించారు.



కార్తి, కృతిశెట్టి జంటగా నటించిన చిత్రం 'వా వాతియార్' (తెలుగులో 'అన్నగారు వస్తారు'). సంక్రాంతికి తమిళంలో విడుదలైన ఈ మూవీ నిరాశ పరిచింది. రెండు వారాల్లో అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ వచ్చేసింది. తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ, తమిళ భాషల్లో ఈ మూవీని చూడొచ్చు.

## ఆ అందమైన జ్ఞాపకాల్ని గుర్తు చేసే చిత్రం

'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా అందర్నీ మెప్పించారు అభిషన్ జీవింత్. ఇప్పుడాయన్ని హీరోగా పరిచయం చేస్తూ మదన్ తెరకెక్కించిన చిత్రం 'విత్ లవ్'. అనస్వర రాజన్ కథానాయిక. సౌందర్య రజనీకాంత్, మగేశ్ రాజ్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఫిబ్రవరి 6న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "తొలిసారి ఈ టీజర్ చూసినప్పుడు చాలా ఆనందంగా




అనిపించింది. ఓ జంట మనసులోనే దాగి ఉండిపోయిన ప్రేమకథతో తెరకెక్కింది. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది" అన్నారు. "నా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాన్ని గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నేను హీరోగా నటించిన ఈ సినిమాని అలాగే ఆదరిస్తారని నమ్ముతున్నా. ఇది మంచి ప్రేమకథతో రూపొందిన చిత్రం. మనందరి జీవితాల్లోని అందమైన జ్ఞాపకాల్ని తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు. నిర్మాత సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. "అభిషన్‌ని మేము హీరోగా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. బయటకు చెప్పలేక.. మనసుల్లోనే దాగుండిపోయిన ప్రేమకథతో రూపొందింది. ఇది చాలా వినూత్నంగా ఉంటుంది. దీంట్లోని స్కూల్ లైఫ్ ఎపిసోడ్స్ అందరికీ బాగా కనెక్ట్ అవుతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో మగేశ్, అనస్వర తదితరులు పాల్గొన్నారు.

**చర్చల దశలో రజనీ - కమల్ సినిమా..**

రజనీకాంత్ కమల్‌హాసన్ కథానాయకులుగా త్వరలో ఓ సినిమా రానుందని.. దానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారని నెట్టింట వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

# ఔషధ మొక్కల సాగుతో లాభాలు.. రైతులతో సీఈవో చంద్రశేఖర్ ముఖాముఖి

జమ్మలమడుగు, జనవరి 31(భారత శక్తి) : ఔషధ మొక్కల పెంపకం లాభ దాయకమైన వ్యవసాయమని ఏపీ ఔషధ మొక్కలు, సుగంధద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ అన్నారు. ఇది తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఇస్తుందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతంలో పలువురు రైతులతో సీఈవో ముఖాముఖి నిర్వహించారు. జమ్మలమడుగు లోని రిపబ్లిక్ క్లబ్ లో జమ్మలమడుగు శాసనసభ్యులు సి.ఆదినారాయణ రెడ్డి సూచనల మేరకు, ఔషధ మొక్కల గురించి సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ నాగేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, రామాంజినేయుల



రెడ్డి, శివ నారాయణరెడ్డి, మాజీ జడ్పిటిసి జయసింహా రెడ్డి, సహకార సంఘం ఛైర్మెన్ పురుషోత్తం రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ఎడిఏ కె.రామ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, బిజెపి నాయకులు ఒంటేరు శ్రీనివాస రెడ్డి, నియోజకవర్గములోని 250మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవుల చంద్రశేఖర్ మాట్లాడారు. ముఖ్యంగా తులసి, అలోవెరా (కలబంద), అశ్వగంధ వంటి మూలికలు సాగుకు అనుకూలమన్నారు. నీరు నిలవని నేలలు, సేంద్రియ ఎరువులు, క్రమబద్ధమైన నీటిపారుదల, మార్కెటింగ్ పరిజ్ఞానం ద్వారా ఈ సాగులో అద్భుతమైన ఫలితాలను పొందవచ్చన్నారు. ముఖ్యమైన ఔషధ మొక్కల పెంపకం సాగు విధానాన్ని ఆయన వివరించారు.

నీరు నిలవని నేలలు ఔషధ మొక్కల సాగుకు ఎంతో అనుకూలమన్నారు. నాటే విధానంలో 1518 సెం.మీ వెడల్పు, 19.520 సెం.మీ ఎత్తు ఉన్న బ్యాగులలో నర్సరీ కంపోస్ట్, ఎరువును 3:1 నిష్పత్తిలో నింపాలన్నారు. వరుసల మధ్య 4560 సెం.మీ దూరం పాటించాలని సూచించారు. తులసి, అశ్వగంధ, అలోవెరా, వేప, నేలవాము, రణపాల, అమృతవల్లి (తిప్పతీగ), వస, కిత్తనార వంటివి వున్నాయన్నారు. నీటి సౌకర్యం ఉంటే ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆకుకూరల తరహాలో నీరు అందించాలన్నారు. నేరుగా విత్తనాలు చల్లడం లేదా కొమ్మల ద్వారా మొక్కలను పెంచవచ్చన్నారు. పోషణకు సేంద్రియ పద్ధతులు, కంపోస్ట్ ఎరువులు నేల సారాన్ని, మొక్క ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అశ్వగంధ, పసుపు, అల్లం, కలబంద వంటి వాటికి మంచి మార్కెట్ వుందన్నారు. ఔషధ మొక్కల సాగుతో అనేక లాభాలున్నాయన్నారు. స్వల్ప పెట్టుబడితో, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. చాలా మొక్కలు తక్కువ నీటితో, కరువు పరిస్థితులను తట్టుకుని పెరుగుతాయని వివరించారు. ఈ మొక్కలను ఆయుర్వేద, యూనానీ, అల్లోపతి మందుల తయారీలో ఉపయోగిస్తారన్నారు. ప్రభుత్వాల నుంచి జాతీయ, రాష్ట్ర మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ ద్వారా సాగుకు అవసరమైన ప్రోత్సాహం అందుతుందన్నారు. ప్రత్యేక శిక్షణ కూడా పొందవచ్చన్నారు. ఔషదమొక్కలు పెంచేటప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఆరోగ్యకరమైన మొక్కలను ఎంచుకోవాలన్నారు. మొక్కల సాగు, కోత సమయాల్లో అవగాహన ఉండాలన్నారు. సేంద్రియ పద్ధతులను పాటించడం వల్ల నేల సారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అందాల అగ్గిపుల్ల చామంతి!

**చలికాలం వచ్చిందంటే చాలు... ఎక్కడ చూసినా చామంతి పూలే కనిపిస్తాయి. వాటిల్లో ఎన్నెన్ని రకాలు! అవన్నీ మనసుకి ఎంత ఆహ్లాదాన్నిస్తాయో కదా! అయితే, వీటిల్లో కాస్త ప్రత్యేకంగా ఉండేది మ్యాచ్‌స్టిక్ క్రిసాన్తిమమే. చూడగానే ఆకట్టుకునే దీన్ని ఎలా పెంచుకోవాలో తెలుసా?**

అగ్గిపుల్ల చామంతి... పేరుకు తగ్గట్లే ఈ పువ్వు రేకలు మ్యాచ్ స్టిక్‌ని తలపిస్తాయి. ఇది హైబ్రిడ్ రకం. పూల రేకలు సన్నని గొట్టాల్లా మెలి తిరిగి బంగారు పసుపు రంగు చివర ఎర్రటి వర్ణంతో కనువిందు చేస్తాయి. చలి పెరిగే కొద్దీ ఎరుపు వర్ణం ఎక్కువవుతుంది. ఈ రకం మొక్కల్ని విత్తనాల ద్వారా కాకుండా కొమ్మ కత్తిరింపులతో పెంచుతారు. దాదాపు రెండు అంగుళాల పొడవు వరకే కాదు...గుబురుగా, దృఢంగా పెరుగుతుంది. ఆకులు ఆకుపచ్చ రంగులో సువాసనతో ఉంటాయి. దీన్ని నేలలోనే కాదు కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు.

### ఎలా పెంచాలంటే...

అగ్గిపుల్ల చామంతిని పెంచడానికి కనీసం 68 గంటల ఎండ అవసరం. నీరు నిలవని సారవంతమైన నేలలో నాటుకోండి. మట్టి పైపొర ఎండిపోయినప్పుడు మాత్రం లోతుగా నీళ్లు పోయండి. ఆకులపై నీళ్లు చల్లొద్దు. ఫాస్ఫరస్ ఎక్కువగా ఉన్న ఎరువుని అందిస్తే బాగా ఎదుగుతుంది. దీనికి గాలి ధారాళంగా ప్రసరిస్తే ఆరోగ్యంగా ఉంటుంది. చీడపీడల్ని తగ్గించుకోవాలంటే సర్ఫ్‌నీళ్లను స్ప్రే చేయండి చాలు. ఇలా సరైన సంరక్షణ చేపడితే ప్రతి











# గార్డెన్ లేకపోయినా.. పచ్చదనం ఆస్వాదించేలా..!

**అలసిపోయినా, ఒత్తిడికి గురైనా.. కాసేపు పచ్చటి మొక్కల మధ్య సేదదీరితే ఆ హాయే వేరు! అందుకే ఎప్పుడైనా మూడ్ బాగోలేకపోతే.. ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసుకున్న గార్డెన్‌లో గడుపుతుంటాం. తద్వారా మనసు పునరుత్తేజితమవడంతో పాటు అలసట కూడా దూరమవుతుంది. అలాగని ప్రతి ఇంట్లో గార్డెన్ ఉండాలని లేదు.. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై ఆసక్తి చూపకపోవచ్చు. అయినా పచ్చదనాన్ని ఆస్వాదించాలంటే కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలున్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**



### పార్కుకు వెళ్లండి!

రోజూ ఉదయం లేదా సాయంత్రం వీలు చూసుకొని కాసేపు వ్యాయామం చేయడం చాలామందికి అలవాటు! ఇదే విధంగా దగ్గర్లోని పార్కుకు వెళ్లడం కూడా రోజువారీ అలవాటుగా మార్చుకోమంటున్నారు నిపుణులు. అదీ కుదరకపోతే పార్కులోనే వ్యాయామాలు చేసేలా ప్లాన్ చేసుకోవచ్చు. తద్వారా ఇటు వ్యాయామం చేసినట్లవుతుంది.. అటు పచ్చదనం మధ్య కాసేపు గడిపినట్లుగానూ ఉంటుంది. అంతేకాదు.. పక్షుల కిలకిలారావాలు, ఫౌంటెయిన్స్ శబ్దాలు.. వంటివన్నీ మనసుకు ఆహ్లాదాన్ని పంచేవే! కాబట్టి కుటుంబమంతా కలిసి రోజూ ఓ అరగంట పార్కులో గడిపేలా సమయం కేటాయించుకోండి. ఇలా రోజూ కాసేపు ప్రకృతితో గడపడం వల్ల దీర్ఘాయుష్షే కాదు.. పనిలో నాణ్యత, పిల్లల్లో ప్రతిభ పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

### ఇండోర్ మొక్కలతో..

కొంతమంది ఇంట్లో తగినంత ప్రదేశం లేకపోవడం వల్ల గార్డెనింగ్ చేసుకోలేకపోతారు. అలాంటి వారు చిన్న చిన్న మొక్కలతో ఇంటి ముంగిలిని అందంగా





తీర్చిదిద్దుకోవచ్చు.. ఇంట్లోనూ కొన్ని ఇండోర్ మొక్కల్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దానివల్ల ఇల్లంతా ఆహ్లాదకరంగా మారిపోతుంది. పైగా ఈ చిన్న మొక్కల్ని మెయింటెయిన్ చేయడం కూడా సులువు.

### గోడలకు 'గ్రీనరీ' హంగులు!


ఇంట్లో గార్డెన్ ఏర్పాటు చేసుకునేంత ఖాళీ ప్రదేశం లేదా? మొక్కలు పెంచుకునేంత తీరికా లేదా? అయినా పచ్చదనాన్ని ఆస్వాదించచ్చు.. అదెలాగంటే..? గోడలకు గ్రీనరీ హంగులద్దుతూ! ఇందులో భాగంగా ప్రకృతి/పక్షులు/అడవులు/ జలపాతాలు.. ఇలా బయట దొరికే వాల్ పేపర్లను తెచ్చుకొని ఇంట్లో గోడలకు అతికించుకోవచ్చు. మరింత న్యాచురల్ లుక్ కావాలనుకునే వారు గోడలకు వాల్ ఆర్ట్ వేయించుకోవచ్చు. పచ్చదనానికి సంబంధించిన సీనరీలు/ఫొటోల్నీ గోడకు అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక అవకాశం ఉన్నట్లయితే ఇండోర్ వాల్ గార్డెన్ ట్రెండ్‌ను ఫాలో అవ్వచ్చు.

### పూలంటే ఇష్టమా?

పువ్వులు, వాటి పరిమళాల్ని ఇష్టపడే వారు.. నచ్చిన పూల మొక్కల్ని ఇంట్లో ఉన్న కాస్త ప్రదేశంలోనే పెంచుకోవచ్చు.. లేదంటే అచ్చం పూల మాదిరిగా కనిపించే ఆర్టిఫిషియల్ పూల మొక్కల్ని ఇంట్లో అమర్చుకోవచ్చు. ఇలా వీటి రంగులూ మనసులోని ఒత్తిళ్లను దూరం చేసి ఆహ్లాదాన్ని పంచుతాయి అంటున్నారు నిపుణులు.

# జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్-XII

* 58 మంది బాలకార్మికులకు విముక్తి
* ఎస్పీ రోహిత్ రాజు




భద్రాద్రి జిల్లా బ్యూరో, జనవరి 31 (భారతశక్తి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ XII లో భాగంగా జనవరి 01 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో మొత్తం 58 మంది బాల కార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని తెలిపారు. ఇందులో 09 మంది బాలికలు ఉండగా 49 మంది బాలురు ఉన్నారన్నారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన 04 బాలికలు, 27 మంది బాలురలను గుర్తించినట్లు తెలిపారు. బాలబాలికలను పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 36 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ XII బృందం పట్టుకున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడం జరిగిందని తెలిపారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 నకు గానీ 1098కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ స్మైల్ XII నకు డిసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి బాలకార్మికులకు విముక్తి కలిగేలా బాధ్యతలు నిర్వర్తించిన షీటీం ఇన్స్పెక్టర్ రాము, ఆరెఎస్సై రమాదేవి, ఎస్సైలు విజయ, సతీష్, శ్రావణ్, రాఘవయ్య, సమ్మిరెడ్డి, లక్ష్మణ్, ఏఎస్సై నాగయ్య, పీసీలు మల్లికాంబ,రాంబాబులను ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# అంతర్జాతీయ విద్యా ప్రభావాన్ని మరింత బలపరుద్దాం

* అంతర్జాతీయ సిసోసియానికి ఆదిత్యం ఇచ్చిన ఐఐటి హైదరాబాద్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 31 : భారతీయ సాంకేతిక సంస్థ హైదరాబాద్ అంతర్జాతీయ విద్యా ప్రభావాన్ని మరింత బలపరుస్తూ ట్రాన్స్ నేషనల్ ఎన్కౌంటర్స్ ఇన్ త్రూ సౌత్ ఇండియా అనే శీర్షికన ఈనెల 8, 9, 29న యూకేఆర్ఐ సిసోసియాన్ని నిర్వహించింది. డాక్టర్ సుహితా భట్టాచార్య నాయకత్వంలో పబ్లిక్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో కింగ్స్టన్ యూనివర్సిటీ సహకారంతో ఈ సిసోజియాన్ని నిర్వహించారు. దక్షిణ ఆసియాలో జరిగిన తొలి కార్యక్రమంగా ఇది నిలిచింది. మూడు రోజులపాటు జరిగిన ఈ సిసోసియం కార్యక్రమాల్లో వలసకాల ప్రదర్శనలు ప్రదర్శన కలలు లింగ ఆదారిత శరీర అనుభవాలు వివిధ అంశాలపై చర్చలు సాగాయి. అదే సమయంలో వాతావరణ మార్పులు, ఆరోగ్య అసమానతలు, లైంగిక హింసకు సంబంధించిన చట్టాల వంటి సమకాలిక గ్లోబల్ సవాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు, స్కాలర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# బద్వేలు నియోజక వర్గములోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

: డీసీసీ బైంకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 31: బద్వేలు నియోజకవర్గం ,అట్లూరు మండలం,అట్లూరు గ్రామంలో బోవిళ్ళ రామచంద్ర రెడ్డి కాలు విరిగి శస్త్ర చికిత్స జరిగి విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని పరామర్శించిన డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి. వారితో పాటు అట్లూరు ఇంచార్జి ఎంపీపీ పోతిరెడ్డి రెడ్డియ్య,అరవ శ్రీనివాస రెడ్డి,మాజీ సర్పంచ్ మిద్దె రమణయ్య,బోవిళ్ళ నరసింహ రెడ్డి,కుంబగిరి ఎంపీటీసీ చిన్న,మట్టి ఈశ్వర రెడ్డి,తపాలా వెంకటేష్,లక్ష్మీ నరసింహ రెడ్డి,హరిరెడ్డి,,పుట్టాముపల్లె వెంకయ్య, అట్లూరు సంజీవ్,దేవర బాలకృష్ణ,దేవర కి టయ్య, దేవర వెంకట రమణ, ఈరీ రవి,నలిపోగు భాస్కర్, నాగ మునీంద్రా,కృష్ణ, తోట శివ, బన్నీ,రమణ, సుబ్బు, సుబ్బారాయుడు, నవీన్ కుమార్ రెడ్డి,రామదాసు, బోవిళ్ళ చెంచు రెడ్డి , తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మడుగుల మౌనిక సాయినాథ్ నామినేషన్ దాఖలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 31 (భారత శక్తి)మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బైంసా పట్టణ మున్సిపల్ కార్యాలయంలో 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మడుగుల మౌనిక సాయినాథ్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి నెలకొంది. అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. నామినేషన్ ప్రక్రియ పూర్తిగా శాంతియుతంగా సాగిందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ క్రమబద్ధంగా కొనసాగుతోందని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.





# గాంధీ భవన్ లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 31 : జహీరాబాద్ పార్లమెంట్ పరిధి లో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, బి ఫార్మ్ పంపిణీ పై పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శనివారం గాంధీ భవన్ లో సన్నాహక సమావేశం జరిగింది. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అజారుద్దీన్, సంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్ అలీ,ఎంపి సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు లు ఈ సమావేశం లో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే కాంగ్రెస్ అభ్యర్థులకు ఆయా జిల్లా ల ఇంఛార్జి మంత్రుల చేతుల మీదుగా బిఫారాలు అందజేయాలని నిర్ణయించారు. గెలిచే అభ్యర్థులకే బి ఫార్మ్ అందజేయాలని, ఎలాంటి పైరవీల కు ప్రభావం కావద్దని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధి లో అన్ని మున్సిపల్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాల్సిందేనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# తునికాకు వేలం పకడ్బందీగా నిర్వహించాలి

* అన్ని యూనిట్లకు టెండర్స్ నిర్వహించాలి.




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 31 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తునికాకు అన్ని యూనిట్లకు టెండర్స్ నిర్వహించాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి గిరిజన ఇతర పేద ప్రజానీకానికి ఎండాకాలం పెట్టుబడి లేని పంటగా ఉపయోగపడే తునికాకు సేకరణ పాటల వేలం ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 249 యూనిట్స్ ఉన్నాయని కోర్ ఏరియా పేరుతో కొన్ని, చేలకపట్టి పేరుతో మరికొన్ని యూనిట్లను వేలం వేయకుండా రద్దుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 50 ఆకుల కట్టకు ఆరు రూపాయలు ప్రభుత్వమే ధర నిర్ణయించి కాంట్రాక్టర్స్ ద్వారా అమలు చేయాలని అన్నారు. విస్తృతంగా కొమ్మ నరికించటం వల్ల తునికాకు సకాలంలో ఏపుగా పెరిగి కూలీలకు గిట్టుబాటు అవుతుందని అన్నారు. గత సంవత్సరం తునికాకు కూలీలకు ఇవ్వాల్సిన బోనస్ నేటికీ చెల్లించకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని యుద్ధ ప్రాతిపదికల బకాయి బోనస్ లో చెల్లించాలని ఆయన అన్నారు. ఆకు సేకరణతో పాటు ఇతర పనులు చేస్తున్న కూలీలకు గతం కంటే 25% కూలి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఫారెస్ట్ శాఖ అధికారులు కొందరు అవినీతి అక్రమార్కులుగా మారి తునికాకు సేకరణ కూలీల శ్రమను దోచుకుంటున్నారని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆకు సేకరణ సమయంలో గాయపడ్డ వారికి 50 వేలు, జంతువుల దాడి,ఎండ వేడిమికి తట్టుకోలేక చనిపోయిన మృతులకు 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి తెలియజేస్తానని అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ముంజంపల్లి వీరన్న, బిల్లా కంటి సూర్యం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈరెల్లి కొమురయ్య, టి యు సి ఐ నాయకులు బోయిని ఉప్పలయ్య, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు బానోత్ నందీశ్వర్, నాయకులు అక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

# పుడమి తల్లికి హారం వృక్ష సంపద

* పుడమి తల్లికి హారం వృక్ష సంపద



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, జనవరి 31: తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మదర్ ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. వృక్ష సంపద పుడమి తల్లి రక్షణ వంటిదని, వృక్షాలను కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిని వృక్షాలు మానవ జీవన విధానంలో ఒక భాగమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి వృక్షాలను కాపాడుతామని జీవరాశి మొనగాడు లో భాగస్వాముల మోగుతామని వాతావరణ కాలుష్యాన్ని తొలగించడానికి తమ వంతు కృషి చేస్తామని వృక్షా జంతువు జీవజాల మనుగడను కాపాడుతామని పుడమి తల్లి అభివృద్ధిలో భాగస్వాముల మవుతామని ప్రతిజ్ఞ చేశారు.వృక్షాలు కూడమి తల్లికి హారము వంటివని ప్రకృతి పరిశుద్ధంగా ఉంటుందని ప్రకృతి అందాలు జంతు జీవరాశి కి ప్రశాంతతను కలిగిస్తాయని తెలిపినారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్, ఏకోక్లబ్ కన్వీనర్ డాక్టర్ సోఫియా రాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు, ఎన్సిసి అధికారి, కళాశాల వివిధ విభాగ దిపతులు, అధ్యాపక బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలు, వాకర్స్ సహకారంతో మాంజా తొలగింపు

- సైబరాబాద్ పోలీసుల స్పెషల్ డ్రైవ్.



సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 31: ప్రజలకు గాయాలు, ప్రాణనష్టం జరగకుండా నివారించే ముందస్తు లక్ష్యంతో వీధులు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, భవనాలపై కోసిన, తెగి పడిపోయి ఉన్న మాంజాను గుర్తించి తొలగించేందుకు సైబరాబాద్ పోలీసులు ఈరోజు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ డ్రైవ్ లో ప్రజలు, వాకర్స్ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం. ఈ డ్రైవ్‌లో భాగంగా గచ్చిబౌలి, అమీన్ పూర్, పటాన్‌చెరు, కొల్లూరు, ఐడీపే బొల్లారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. ఈ క్రమంలో గచ్చిబౌలి పోలీసులు మూడు టీమ్ లు గా మారి కొండపూర్, మజీద్ బండ ప్రాంతాల్లో ప్రజల సహకారంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, భవనాలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ప్రమాదకర మాంజా ను వినియోగించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇలాపూర్ మైదానం, తులసివనం కాలనీలో 150 వాకర్లతో కలిసి దారాలను తొలగించారు. వీటి వాడకం చట్ట విరుద్ధమని, కొన్నా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు అవగాహన కల్పించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రి గ్రౌండ్, సాకి చెరువు, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో స్థానికులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ రేడియల్ రోడ్డు, ఓజోన్ హైట్స్ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని రోడ్లపై ఉన్న గాజు నూలును తొలగించారు. ప్రాణాంతక పతంగి నూలు తయారీ, విక్రయించినా, నిల్వ ఉంచినా లేదా వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎక్కడైనా చైనా మాంజా అమ్మకాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలను కోరారు. క్కడైనా మాంజా వేలాడుతూ కనిపిస్తే జాగ్రత్తగా దాన్ని తొలగించి డిస్పోజ్ చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.



సరూర్ నగర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల దృశ్యా పర్యావరణానికి ప్రాముఖ్యతనిస్తూ విజ్ఞాన మేళ (సైన్స్ ఎగ్జిబిషన్) శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లక్ష్మినాథాచార్యులు,విద్యాపీఠం భాగ్యనగర్ విభాగ్ ప్రముఖ్ భూషణ్ భాగ్యనగర్ ప్రముఖ్ ఉన్నాం శ్రీధర్ పర్యావరణ ప్రముఖ్ రాఘవేంద్ర, ఆర్ఎస్ఎస్ పర్యావరణ ప్రముఖ్ రాజగోపాల్ పాల్ టెక్ ఫౌండేషన్ యజమాని యాదిరెడ్డి పాఠశాల కమిటీ సభ్యులు,పాల్గొన్నారు. ఎల్బీనగర్, జనవరి 31(భారత శక్తి ):

# ఇ-సైకిళ్లపై భారీ రాయితీ.. గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర



అమరావతి, జనవరి 31 (భారతశక్తి): ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇసైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇసైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.10 వేల సబ్సిడీ.. రూ.25 వేలకే సైకిల్ ఇమోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ.35,000 విలువైన ఒక్కో ఇసైకిల్‌పై ప్రభుత్వం రూ.10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ.25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇమోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇసైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, కుప్పం ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. "ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారు, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం" అని పేర్కొన్నారు. ఇసైకిళ్లకు పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

# ఏప్రిల్ 30 నాటికి
## అయోధ్య రామాలయం అన్ని పనులు పూర్తి

అయోధ్య, జనవరి 31 (భారతశక్తి): అయోధ్యలోని రామాలయానికి సంబంధించిన అన్ని నిర్మాణ పనులు ఏప్రిల్ 30 నాటికి పూర్తవుతాయని, ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం దాదాపు రూ.1,900 కోట్లుగా అంచనా వేసినట్టు రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎల్ అండ్ టీ, టీసీఎస్ కంపెనీలు మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నాయని ఆయన వెల్లడించారు. రామాలయంలో మిగిలిన పనులు వేగంగా సాగుతున్నాయని, మరో మూడు నెలల్లో అవి పూర్తవుతాయని తెలిపారు. రూ.1,900 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1,600 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు కూడా పూర్తవుతాయని అన్నారు. ఆ తర్వాత ఆలయం శ్రీరామ జన్మభూమి ఆలయ ట్రస్ట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు.

# భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు... అమెరికా రిటైర్డ్ అధికారి కీలక వ్యాఖ్యలు

అమెరికా, జనవరి 31 (భారతశక్తి): భారతదేశం తన సొంత ప్రయోజనాలను కాదని, అమెరికా చెప్పే ప్రతిదానికి తలాడించదని యూఎస్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మాక్‌గ్రెగర్ అన్నారు. సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని అన్నారు. రష్యాతో వ్యాపారం చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. కొంతకాలంగా అమెరికా, భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలపై డగ్లస్ స్పందిస్తూ, అమెరికా ఎప్పుడూ కూడా ప్రపంచ దేశాలు తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటుందని, లేదంటే వ్యతిరేకంగా ఉన్నాయని భావిస్తుందని అన్నారు. అమెరికా చెప్పే ప్రతి అంశంతోలేదా అమెరికా చేసే ప్రతి దానితో భారత్ ఎప్పుడూ ఏకీభవించాలని చూడవద్దని అన్నారు. దశాబ్దాలుగా భారత్, రష్యా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయవద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని అన్నారు. "మీరు రష్యాతో వ్యాపారం చేస్తే కనుక మేం మీకు వ్యతిరేకం" అనేది మూర్ఖత్వమని అన్నారు. మలేసియా వంటి దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం తమ ముఖ్య విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని అన్నారు. ప్రపంచ దేశాలపై బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారీతిన సుంకాలు విధిస్తే అది అమెరికాకే నష్టమని అన్నారు.

# అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనుల జోరు..

అమరావతి, జనవరి 31 (భారతశక్తి): రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు మళ్లీ ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. ఇందులో భాగంగా అమరావతి పరిధిలోని నవులూరు వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు తుది దశకు చేరుకున్నాయి. స్టేడియం నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయిందని ఏపీ మున్సిపల్ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు స్టేడియం నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "రాజధాని అమరావతిలో నవులూరు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో దీనిని సిద్ధం చేస్తున్నాం" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ స్టేడియంను మొత్తం 24 ఎకరాల విస్తీర్ణంలో 34 వేల సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. విజయవాడకు 13 కిలోమీటర్లు, గుంటూరుకు 16 కిలోమీటర్ల దూరంలో వ్యూహాత్మకంగా ఇది నిర్మితమవుతోంది. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి, స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రిగా
## సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం..

మహారాష్ట్ర, జనవరి 31 (భారతశక్తి): రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఆ పదవి వరించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ముంబైలోని లోక్‌భవన్‌లో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు. సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం లోక్ భవన్‌లో 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి. సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అజిత్ పవార్ దార్శనికతను సునేత్రా నెరవేరుస్తారని ఆయన ఆకాంక్షించారు. "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఈ బాధ్యతను చేపట్టిన మొదటి మహిళ సునేత్రా పవార్ జీకి శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా పనిచేస్తారని మరియు దివంగత అజిత్‌దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీనితో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎన్సీపీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఆమె ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

హైదరాబాద్, జనవరి 31 (భారతశక్తి): బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# రేపు కేసీఆర్ సిట్ విచారణ...
## రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, జనవరి 31 (భారతశక్తి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని బీఆర్ఎస్ రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఆదివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వం దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని, ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు శాంతియుతంగా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేపట్టాలని, పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని సూచించారు. కాగా, కేసీఆర్ రేపు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కానున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం ఆయన విచారణకు హాజరు కావాలని నిర్ణయించారు. నందినగర్‌లోని నివాసంలో సిట్ ఆయనను విచారించనుంది.

# వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం.. రేపే కేంద్ర బడ్జెట్

ఢిల్లీ, జనవరి 31 (భారతశక్తి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు (ఫిబ్రవరి 1న) పార్లమెంటులో 202627 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 202526, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (FY27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

# గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

జనవరి 31 (భారతశక్తి): తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన 8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు. మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.

# అమెరికాలో మళ్లీ షట్‌డౌన్.. పాక్షికంగా స్తంభించిన ప్రభుత్వ కార్యకలాపాలు

అమెరికా, జనవరి 3 : అమెరికాలో మరోసారి ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా స్తంభించాయి. 2026 సంవత్సరానికి సంబంధించిన ఫెడరల్ బడ్జెట్‌కు కాంగ్రెస్ (పార్లమెంట్) ఆమోదం లభించకపోవడంతో శనివారం నుంచి పాక్షిక షట్‌డౌన్ అమల్లోకి వచ్చింది. ఫెడరల్ నిధుల గడువు నిన్న అర్ధరాత్రితో ముగియడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయితే, ఈ షట్‌డౌన్ స్వల్పకాలమేనని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని చట్టసభ సభ్యులు అంచనా వేస్తున్నారు. మిన్నియాపాలిస్‌లో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్ల చేతిలో ఇద్దరు నిరసనకారులు మరణించడంపై డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో బడ్జెట్ చర్చలు నిలిచిపోయాయి. ఈ ఘటన కారణంగా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి (డీహెచ్‌ఎస్) నిధుల కేటాయింపుపై ప్రతిష్టంభన ఏర్పడి, షట్‌డౌన్‌కు దారితీసింది. ఒప్పందం కుదరకపోవడంతో విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, రక్షణ వంటి పలు కీలక శాఖల్లో అత్యవసరం కాని కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ షట్‌డౌన్ కొనసాగితే వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనం లేకుండా పనిచేయాల్సి రావచ్చు లేదా వేతనం లేని సెలవుపై వెళ్లాల్సి ఉంటుంది. "డ్రగ్ స్మగ్లర్లు, చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడేవారు, అక్రమ రవాణాదారులను వదిలేసి.. ట్రంప్ ప్రభుత్వం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై తమ వనరులను వృథా చేస్తోంది" అని సెనేట్ డెమోక్రాటిక్ మైనారిటీ విప్ డిక్ డర్బిన్ విమర్శించారు. ఇప్పటికే సెనేట్ కీలకమైన ఐదు ఫండింగ్ బిల్లులను ఆమోదించింది. డీహెచ్‌ఎస్‌పై చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు రెండు వారాల తాత్కాలిక నిధుల ప్యాకేజీని కూడా ఆమోదించింది. ఈ ఒప్పందానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు తెలిపారు. త్వరగా చర్యలు తీసుకోవాలని హౌస్‌ను కోరారు. గత శరదృతువులో నెల రోజులకు పైగా షట్‌డౌన్ జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఇది రెండో షట్‌డౌన్.

# బెగ్గిపల్లె గ్రామంలో ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 31 (భారతశక్తి): ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా ప్రజలతో మమేకమయ్యారు. శనివారం ఆయన బెగ్గిపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లి, వారిని ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలను విచారించి, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముగ్గురు లబ్ధిదారులకు తన చేతుల మీదుగా పింఛన్లు అందించారు. మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్నతాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛను అందజేసి వారికి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రే నేరుగా తమ ఇంటికి వచ్చి పింఛను అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో భాగంగా సీఎం ఈ కార్యక్రమం చేపట్టారు.



# నలంద పబ్లిక్ రిలేషన్స్ యూత్ ఫెస్టివల్ – 2026




హైదరాబాద్, జనవరి 31(భారత శక్తి ప్రతినిధి ): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ), హైదరాబాద్ చాప్టర్, డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల సహకారంతో బాగ్‌లింగంపల్లిలోని డా. బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో నలంద పబ్లిక్ రిలేషన్స్ యూత్ ఫెస్టివల్ - 2026ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాలల నుండి వచ్చిన జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన సుమారు 180 మంది విద్యార్థులు, అధ్యాపకులు, పీఆర్ఎస్ఐ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు, డా. అజిత్ పాఠక్ ముఖ్య అతిథిగా హాజరై, "సమాజంపై ప్రజా సంబంధాలు, ఆధునిక జర్నలిజం ప్రభావం - నైతికత" అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పబ్లిక్ రిలేషన్స్, జర్నలిజం రెండూ ఒకే వేదికపై అంటే సమాచార ప్రసారంపై ఆధారపడి ఉన్నాయని డా. పాఠక్ పేర్కొన్నారు. సత్యం, విలువలు, నైతిక కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, కృత్రిమ మేధస్సు (AI)ను జాగ్రత్తగా, అంతే బాధ్యతతో వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన తన ప్రసంగంలో విద్యార్థును ఉద్దేశించి మాట్లాడారు. పీఆర్ఎస్ఐ మాజీ దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షులు, నలంద ఫోరం కన్వీనర్ శ్రీ కృష్ణ బాజీ తన ప్రసంగంలో హైదరాబాద్ చాప్టర్ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచి, 11 విద్యాసంస్థల్లో నలంద విద్యార్థుల ఫోరంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి స్వాగత ప్రసంగంలో, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడానికి వచ్చిన డా. అజిత్ పాఠక్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల మేలు కోసం పీఆర్ఎస్ఐ చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో హైదరాబాద్ చాప్టర్ సాధించిన విజయాలను వివరించారు. నలంద కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ పీఆర్ఎస్ఐ మాజీ సెక్రటరీ జనరల్, 'పబ్లిక్ రిలేషన్స్ వాయిస్' సంపాదకులు వై . బాబ్జీ, విద్యాసంస్థల్లో విద్యార్థి ఫోరంల ఏర్పాటు ద్వారా మార్గనిర్దేశక వ్యవస్థను నిర్మించి, భవిష్యత్తు నాయకులను తయారు చేయాలనే ఉద్దేశాన్ని ప్రశంసించారు. హైదరాబాద్ చాప్టర్ మాజీ చైర్మన్, 'కార్పొరేట్స్ నుంచి స్కూల్స్‌కు పీఆర్' కార్యక్రమ కన్వీనర్ లయన్ కె. గోవిందరాజ్, పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు, ఆదర్శాలను పిల్లలలో నాటాలనే డా. అజిత్ పాఠక్ దృక్పథాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన కళాశాల డైరెక్టర్ డా. యాదగిరి, డా. శేఖర్ మట్టా, ప్రిన్సిపాల్ గత సంవత్సరం విద్యార్థుల బూట్ క్యాంప్ నిర్వహణకు పీఆర్ఎస్ఐ నుండి లభించిన జాతీయ గుర్తింపుపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ చాప్టర్ ఏప్రిల్ 19న నిర్వహించనున్న 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ప్రజా సంబంధాల కాన్ఫరెన్స్ బ్రోచర్ ను విడుదల చేశారు. పీఆర్ వాయిస్ అసోసియేట్ ఎడిటర్ పి. మోహన్ రావు, నలంద పీఆర్ఎస్ఐ విద్యార్థి ఫోరం సహకన్వీనర్ డా. ఫాతిమా సమర్థవంతంగా నిర్వహించారు.

## కరాటేలో అంతర్జాతీయ బంగారు పథకాలను సాధించిన మీసాల జతీష్


ఎల్బీనగర్, జనవరి 31(భారత శక్తి): శుక్రవారం విశాఖపట్నం నందు జరిగిన కరాటే ఇండియా ఆర్గనైజేషన్ లో భాగమైన యునైటెడ్ షోటోఖాన్ కరాటే డూ ఇండియా, మహిర షోటోఖాన్ కరాటే డూ ఇండియా వారి సంయుక్త ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం నందు నిర్వహించిన 9వ ఆల్ స్టైల్స్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2026 నందు 4 దేశాల మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో నల్లగొండ జిల్లా మద్దిరాల మండలం, ముకుందాపుర గ్రామానికి చెందిన మీసాల ఎల్లేష్ ,మమత కుమారుడు మీసాల జతీష్ కటాస్ విభాగంలో బంగారు పతకం, కుమిటే విభాగంలో మరో బంగారు పతకాన్ని సాధించాడు. హైదరాబాద్ కొత్తపేటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యను అభ్యసిస్తూ చిన్నప్పటి నుండి క్రీడలలో చురుగ్గా రాణిస్తూ పాల్గొన్న ప్రతి అంతర్జాతీయ పోటీలలో బంగారు పథకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావడం గర్వకారణమని




కరాటే కోచ్ మాస్టర్ మహేష్ నాయక్ పలువురు కొనియాడారు.

## కుమ్మర సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి సహకరించాలని దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి విన్నపం

ఎల్బీనగర్, జనవరి 31(భారత శక్తి): మన్సూరాబాద్ డివిజన్ కుమ్మర సంక్షేమ సంఘం నాయకులు, పెద్దలు మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి డివిజన్ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుమ్మర సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి, స్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరిన వెంటనే వారు సంబంధిత అధికారులతో మాట్లాడి సంఘం సభ్యులు చెప్పిన కార్యక్రమాలు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే సరస్వతీ నగర్ కాలనీలో ట్రంక్ లైన్ కోసం తవ్విన రోడ్లను ప్యాచ్ వర్క్ లాగా కాకుండా,పూర్తిగా వేసేలా ఆదేశించాలని డివిజన్ భారాస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాలనీవాసులు నర్రి వెంకన్న,



రామాచారి, రంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యేని కోరడం జరిగింది.ఈ పనిని కాలనీ వారు కోరినట్లే పూర్తి చేయిస్తానని,అందుకు కావాల్సిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని,నిధుల కేటాయింపు కూడా పూర్తయి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.





## విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి..

* **తెలంగాణ జనసమితి నియోజకవర్గ ఇన్చార్జ్ కెవి రంగారెడ్డి**

ఎల్బీనగర్, జనవరి 31(భారత శక్తి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో సైతం రాణించాలని తెలంగాణ జనసమితి ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్చార్జి, రాష్ట్ర నాయకులు కె.వి రంగారెడ్డి అన్నారు. చైతన్యపురిలోని జీనియస్ గ్రామర్ స్కూల్ ఆధ్వర్యంలో విమల మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ 2026 ను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులకు వార్షిక క్రీడా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను క్రీడలలో రాణించేలా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మన ప్రాంతం నుండి క్రీడాకారులను తయారు చేయాలని సూచించారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంగా నిర్వహించిన క్రీడా సంబరంలో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు.ఈ కార్యక్రమంలో జైహింద్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, అంకుశ రెడ్డి, తక్నీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ అనారోగ్యంతో దుర్మరణం

ఎల్బీనగర్, జనవరి 31(భారత శక్తి): కొత్తపేట పీవీటి మార్కెట్ పక్కన ఉన్న హనుమాన్ ఆలయం వద్ద బిక్షాటన చేసే గుర్తు తెలియని మహిళా బిక్షగత్తే అనారోగ్యంతో, స్పృహ తప్పి కమాన్ పక్కన పడుతుందని స్థానికులు గురువారం 100 కు ఫోన్ చేసి పోలీస్ వారికి తెలిపారు. దాంతో సీఐ సైదిరెడ్డి ఆదేశాలతో ఆ మహిళను, చికిత్స అందించిన తరువాత అబ్దుల్లాపూర్ మెట్ లోని ఏలేటి అనాథ ఆశ్రమంలో చేర్పించారు.కానీ ఆరోగ్యం బాగాలేక శుక్రవారం ఉదయం ఆశ్రమంలోనే కన్నుమూసింది. ఈ విషయం పోలీసులకు తెలిపిన ఆశ్రమం యాజమాన్యం మృతదేహన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ



మహిళకు సంబంధించిన వారు ఎవరైనా సీఐ సైదిరెడ్డి 8712662307, ఎస్ఐ శిరీష 8712553723 నంబర్లకు సమాచారం అందించగలరని కోరారు.


## యాదావిధిగా ప్రజావాణి :జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 31: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీన యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయండి..!

* **ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

కడప, జనవరి 31(భారత శక్తి): పారిశ్రామికంగా విస్తృతమైన వనరులు, ఉపాధి అవకాశాలున్న కడప జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించి పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కడప కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆ దిశగా జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను, పెట్టుబడి దారులకు అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి పరిశ్రమల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మొత్తం 18 శాఖలకు సంబంధించి 10,158 దరఖాస్తులు అందగా, వాటిలో ఇప్పటి వరకు 10,033 దరఖాస్తులకు అనుమతి ఇవ్వడం జరిగిందని, 9,983 దరఖాస్తులు పరిశీలనలో, 50 పరిశీలనకు సిద్ధంగా ఉన్నాయని, 87 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించడం జరిగిందన్నారు.




43 దరఖాస్తులు పలు కారణాల వల్ల పెండింగ్ లో ఉంచడం జరిగిందన్నారు. ప్రొద్దుటూరు ఐడిపి పరిధిలో గోల్డ్ ఆర్నమెంట్ ఇండస్ట్రీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం జరిగింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా 17 పరిశ్రమలకు రెన్యూవల్, అనుమతులు ఇవ్వడం జరిగింది. అలాగే 13 పరిశ్రమల స్థాపనకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. లీగల్ మెట్రోలోజి ద్వారా 7 యూనిట్లను తనిఖీ చేయడం జరిగిందని, భూ గర్భజల శాఖ ద్వారా 3 పరిశ్రమలకు బోర్ వెల్స్ వేసేందుకు అనుకులతలను, ఫైర్ శాఖ ద్వారా ఒక ఇండస్ట్రీ, అర్బన్ డేవేలప్ మెంట్స్ ద్వారా ఒక పరిశ్రమను పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.పారిశ్రామిక అభివృద్ధి పాలసీ ప్రకారం జిల్లాలో మొత్తం రూ. 2,22,79,499 ల మేర నిధుల విడుదలకు అనుమతినివ్వడం జరిగిందన్నారు. ఇందులో ఐడిపి 202327 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 40,45,361 లు, జెనరల్ కేటగిరి కింద రూ. 43,60,823లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐడిపి 202429 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 1,24,37,812 ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐడిపి 201520 పాలసీ ప్రకారం జెనరల్ కేటగిరి కింద రూ. 5,62,806 లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐడిపి 202023 పాలసీ ప్రకారం ఓబీసీ కేటగిరి క్రింద రూ. 78,447 లు, ఎస్సి కేటగిరి క్రింద రూ. 7,94,250 ల మేర నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు.కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపణపై అవగాహన పెంపొందించాలన్నారు. అంతకుముందు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం చాంద్ బాషా సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా.. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, సిక్కి డిసి డి. జ్ఞాన ప్రకాష్, డిక్కీ డిసి శివ శంకర్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ చిన్నారావు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ అధికారులు, డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్ శాఖల అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

* **రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

భద్రాద్రి జిల్లా బ్యూరో, జనవరి 31 (భారతశక్తి): ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈ ఆర్ ఓ లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని




పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని, ఓటరు జాబితాలో గల ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరపున బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని తెలిపారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్, సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గాలలో బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు ప్రతి ఇంటికి వెళ్ళి పరిశీలిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకుంటామని, పెండింగ్ లో గల ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.